

జిల్లా కనెక్టివిటీలో ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రోడ్ల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. అడుగుకో గుంతతో రహదారులు దారుణంగా మారాయి. కనీసం ప్యాచ్ వర్కులు చేసిన దాఖలాలు కూడా లేదు. గడిచిన ఐదేళ్లలో ఈ రోడ్లను పట్టించుకున్న నాథుడు లేడు. ప్రజలు గగ్గోలు పెడుతున్నా మాకేం సంబంధం లేదన్న రీతిలో నాటి ప్రజాప్రతినిధులు వ్యవహరించారు. అఖరుకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(సీఐఆర్ఎఫ్) కింద మంజూరైన రోడ్లను కూడా బాగు చేయలేకపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



వలేటివారిపాలెం : చిన్నపాలెం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మోకాలిలోతు గుంతలు



కావలి : తారు లేచిపోయి, గుంతలు ఏర్పడిన తుమ్మలపెంట రహదారి



బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చి-చెన్నూరు రోడ్డుపై గుంతలు

అడుగుకో గుంత..
ప్రయాణమంటేనే చింత!

- జిల్లాలో రోడ్లు ఎప్పటికి బాగు పడేనో!?
- నాడు పూర్తిగా విస్మరించిన వైసీపీ సర్కారు
- బిల్లులు రాక పనులు చేయని కాంట్రాక్టర్లు
- కూటమి ప్రభుత్వంలో మొదలు కాని పనులు
- అత్యవసర పనులకు అధికారుల ప్రతిపాదనలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

ప్రభుత్వమే అలా ఉంది ఇక మేమేం తక్కువా.. అన్నట్లుగా ఆర్‌అండ్‌బీ అధికారుల వ్యవహార శైలి ఉంటోంది. టెండర్లు పిలిచి నెలలు గడిచినా పనులు మొదలుపెట్టించడం లేదు. బిల్లులపై స్పష్టమైన హామీ రాకపోవడంతో కాంట్రాక్టర్లు కూడా ఆచీతూచీ వ్యవహరిస్తున్నారు. గతేడాది ప్యాచ్‌లు వేసేందుకు అనుమతులు వచ్చినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఆ తర్వాత టెండర్లు వేయించిన అధికారులు.. తూతూమంత్రంగా పనులు చేయించి మమ అనిపించారన్న విమర్శలున్నాయి. కాగా ఇటీవల రోడ్ల దుస్థితిపై సమీక్షించిన కూటమి ప్రభుత్వం అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సిన రోడ్ల వివరాలు పంపాలని అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో కొన్ని ప్రతిపాదనలు జిల్లా నుంచి వెళ్లాయి. వాటికి ఆమోద ముద్ర వేశాక ఈ అత్యవసర పనులు మొదలపెడతామని అధికారులు చెబుతున్నారు.

● ఈ రోడ్లు మరీ అధ్వానం

గూడూరు -రాజంపేట రోడ్డు, నెల్లూరు - పొదలకూరు-సైదాపురం రోడ్డు, నెల్లూరు- సౌత్‌మోపూరు- తాటిపర్తి రోడ్డు, నెల్లూరు - మైపాడు రోడ్డు, కావలి - తుమ్మలపెంట రోడ్డు, ఉదయగిరి - నందవరం రోడ్డు, రాజుపాలెం- ఇస్కపాలెం రోడ్డు వంటివి ప్రధాన రోడ్లపై ప్రయాణమంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఇక నెల్లూరులోని పొదలకూరు రోడ్డు కూడా ఎంత ఇబ్బందికరంగా మారిపోయిందో అటుగా వెళ్లే వారికి తెలుస్తుంది.



వరికుంటపాడు : అధ్వానంగా తొడుగుపల్లి-నార్త్‌కొండాయపాళెం రహదారి

● దారుణంగా గ్రామీణ రోడ్లు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన కనెక్టివిటీ రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. వైసీపీ ఐదేళ్లలో వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో 2022లో ప్రధాన కనెక్టివిటీ రోడ్లను వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నిధులతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 222 రోడ్ల అభివృద్ధికి పంచాయతీ రాజ్ శాఖ అనుమతులిచ్చింది. అయితే ఏఎంసీల ఆదాయాన్ని ష్యూరిటీగా పెట్టినా బ్యాంకులు రుణం ఇచ్చేందుకు ముందుకు రాలేదు. రుణం మంజూరు కాకుండానే పంచాయతీ రాజ్ ఇంజనీర్లు ఈ రోడ్లకు టెండర్లు పిలిచారు. 222 వర్కులను 38 ప్యాకేజీలుగా విభజించి మూడు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఎన్నికలకు ముందు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో కొందరు కాం ట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేసినా అగ్రిమెంటు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటివరకు కేవలం 4 ప్యాకే జీలకు మాత్రమే అగ్రిమెంట్లు చేసుకోగా ఇంకా 26 ప్యాకేజీలకు అగ్రిమెంట్లు చేయాల్సి ఉంది. రెండేళ్లలో పూర్తయింది కేవలం 15 వర్కులు మాత్రమే. మరో 45 రోడ్డు పనులను ప్రారంభించినా పూర్తి కాలేదు. 91 వర్కులు అసలు ప్రారంభమే కాలేదు. మరో 71 రోడ్డు పనులకు ఎవరూ టెండర్లు వేయలేదు. ఇప్పటి వరకూ అరకొరగా పనులు జరిగినా ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం బిల్లు ఇవ్వకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. కాగా బ్యాంకు రుణం రాకపోవడంతో నాబార్డు నుంచి రుణం కోరేందుకు ప్రతిపాదనలు పంపారు. అక్కడ 222 వర్కులకు 129 వర్కులకు మాత్రమే ఈ ఏడాది ఫిబ్రవరిలో రుణం మంజూరైంది. మిగిలిన వర్కుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాబార్డు రుణం మంజూరు చేశాక రివైజ్డ్ ఎస్టిమేషన్లతో పంచాయతీ రాజ్ ఇంజనీర్లు మిగిలిన వర్కులకు మరోసారి టెండర్లు ఆహ్వానించగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం గమనార్హం.




అల్లూరు : ధ్వంసమైన ఇస్కపల్లి-అల్లూరు రోడ్డు

అటవీ అనుమతులు లేక..

ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు దుస్థితి ఇది. అటవీ అనుమతులు లేకపోవడంతో 3.2 కి.మీ మేర రహదారి నిర్మాణానికి నోచుకోలేదు. ఈ సమస్యతో కొండకింద 11 గ్రామాలకు చెందిన 15వేల మంది ప్రజలకు ఈ రహదారే దిక్కు. రహదారి నిర్మించి తమ కష్టాలు తీర్చాలని ఆందోళనలు చేపట్టినా, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడించినా ఫలితం లేదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ రోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఉదయగిరి రూరల్



- విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయుల కృషి
- గురుపూజోత్సవంలో కలెక్టర్ ఆనంద్

గురువులే సమాజ నిర్దేశకులు



ఉపాధ్యాయుడు రామచంద్రయ్య యాదవ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 5 : గురువులే సమాజ నిర్దేశకులని, వారికి ఎవరూ సాటిరారని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగ ణంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి కూడా గురువులను గౌరవిస్తూ విద్యతోపాటు దేశభక్తిని పెంపొందించుకోవాని సూచించారు. కేరళ రాష్ట్రంలోని చిన్నగ్రామంలో విద్యనభ్యసించిన తాను ఉపాధ్యాయురాలైన తన తల్లి, గురువుల ప్రోత్సాహంతోనే ఉన్నతంగా రాణించి ఐఏఎస్ సాధించినట్లు చెప్పారు. నేటితరం ఉపాధ్యాయులు కూడా ఉత్తమ బోధన అందించి విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన 60 జిల్లాల్లో నెల్లూరు జిల్లా ఉండడం గర్వకారణంగా ఉందని తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యలో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధికశాతం నిధులు కేటాయించడంతోపాటు ఉపాధ్యాయుల కొరత కూడా తీర్చనున్నట్లు చెప్పారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గురువులను కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధులు శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందచేశారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డీఈవో రామారావు, నగర మేయర్ స్రవంతి, ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, వయోజన విద్య డీడీ ఆజాద్, విద్యా శాఖ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ టీచర్లు మాకొద్దు మహాప్రభో!

● గుమ్మళ్లదిబ్బ పాఠశాల విద్యార్థుల నిరసన



కోవూరు : దేశమంతా గురుపూజోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులతో ఉపాధ్యాయులు పూజలు అందుకుంటుంటే కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బలోని జడ్పీ హైస్కూల్ పాఠశాల పిల్లలు మాత్రం 'ఈ టీచర్లు మాకొద్ద'ంటూ రోడ్డెక్కారు. తెలుగు ఉపాధ్యాయుడు ప్రతిరోజూ మద్యం సేవించి వీరంగం సృష్టిస్తుండగా ప్రధానోపాధ్యాయిని అయనకు వంతపాడుతున్నారని ఆందోళనకు దిగారు. పాటూరు- కోవూరు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయుడి చేష్టలను వివరించారు. తరగతులకు చొక్కా విప్పేసి రావడం, మద్యం సేవించి మాట్లాడుతుండటాన్ని సహించలేక పోతున్నట్లు వాపోయారు. హెచ్ఎంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని దుయ్యబట్టారు. గురుపూజోత్సవం రోజునే విద్యార్థులు ఆందోళన చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. చివరకు ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ సర్దిచెప్పడంతో వారు శాంతించారు.


సోమశిల, కండలేరు ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటున్నాయి. పెన్నా క్యాచ్‌మెంట్లో వర్షాలు కురవకపోయినా ఈ రెండు ప్రాజెక్టుల్లోకి కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. ఎన్డీయే కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయడంతో జిల్లా రైతుల మోములో ఆనందం కనిపిస్తోంది. గత రబీ సీజన్‌లో పూర్తి ఆయకట్టులో సాగు జరగకపోవడం, ఈ ఏడాది రెండో పంట అసలు లేకపోవడంతో రైతాంగం దిగాలు చెందింది. ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉన్నప్పుడు సాగు లేకపోవడం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఈ క్రమంలో ఈ రెండు జలాశయాలు డెడ్ స్టోరేజీకి చేరుకోవడం, పెన్నా పరివాహకంలో వర్షాలు లేకపోవడం రైతులను మరింత ఆందోళనకు గురిచేసింది. ఈ ఏడాది కూడా సాగు లేకుండా భూములు ఎక్కడ బీడు పెట్టుకోవాలోనని మథనపడుతున్నారు. ఇంతలో కృష్ణా జలాలను ప్రభుత్వం సోమశిలకు మళ్లించడంతో రైతుల్లో భయాలన్నీ తొలగిపోయాయి. రానున్న సీజన్‌కు సరిపడా నీరు ఇప్పటికే సోమశిలకు చేరింది. దీంతో సాగుపై రైతాంగంలో ధీమా నెలకొంది.

- 'సోమశిల'కు భారీగా చేరుతున్న వరద
- 41 టీఎంసీలకుపైగా చేరిన నిల్వ
- వరద రాకతో నిండుతున్న 'కండలేరు'
- రబీలో పూర్తి ఆయకట్టు సాగుకు అవకాశం

కృష్ణమ్మ పలకరింత..
అన్నదాత పులకింత!

నెల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జూలై 31వ తేదీ నాటికి సోమశిల, కండలేరు డ్యాంలలో నిల్వలు అడగుంటాయి. సోమశిలలో 9 టీఎంసీలు, కండలేరులో 6 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో తాగునీటికి కూడా ఇబ్బందులు తప్పవన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే కృష్ణా పరివాహకంలో వర్షాలు కురవడం, శ్రీశైలం జలాశయంలో 860 అడుగుల నీటిమట్టం దాటడంతో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తీసుకొచ్చి, ఆ దామాషా నీటిని రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు వినియోగించాలని భావించింది. ఆ క్రమంలోనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సోమశిలకు నీటి విడుదల మొదలుపెట్టింది. తొలుత ఐదు వేల క్యూసెక్కులను విడుదల చేసిన ప్రభుత్వం, ఆ తర్వాత క్రమేణా పెంచుకుంటూ వచ్చింది. ఇప్పుడు కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ నిండిపోవడంతో పూర్తి సామర్థ్యం నీటిని విడుదల చేస్తోంది. గురువారం సోమశిలకు 14,146 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా, 41.260 టీఎంసీ నీరు నిల్వ ఉంది. కాగా కృష్ణా జలాలు వస్తుండడంతో కండలేరుకు కూడా నీటిని విడుదల మొదలుపెట్టారు. తొలుత 2 వేల క్యూసెక్కులు విడుదల చేసిన అధికారులు ప్రస్తుతం దానిని ఆరు వేలకు పెంచారు. గత నెల 22 నుంచి సోమశిల నుంచి కండలేరుకు నీటి విడుదల చేస్తుండగా, ఇప్పటి వరకూ దాదాపు 4 టీఎంసీలను పంపారు.

ప్రాజెక్టు పేరు	సోమశిల	కండలేరు
సామర్థ్యం	77.988 టీఎంసీలు	68.03 టీఎంసీలు
ప్రస్తుత నిల్వ	41.260 టీఎంసీలు	8.745 టీఎంసీలు
ఇన్‌ఫ్లో	14,146 క్యూసెక్కులు	5,450 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	7,060 క్యూసెక్కులు	450 క్యూసెక్కులు



● నాడు, నేడూ టీడీపీనే!

వైసీపీ ప్రభుత్వం జిల్లా రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలమైంది. ఓ వైపు వర్షాలు లేక ప్రాజెక్టులు నిండుకుంటున్నాయని తెలిసినా నీటి యాజమాన్యంలో నిర్లక్ష్యం వహించింది. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా రైతులు గత రబీలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. 2023లో రెండో పంట సమయంలో భారీగా నీటి దుర్వినియోగం జరిగింది. దాదాపు 20 టీఎంసీలను సముద్రం పాలు చేశారు. ఆ ప్రభావం రబీపై పడింది. ప్రస్తుత జిల్లాలో 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే కనీసం అందులో సగం ఆయకట్టుకు కూడా నీరు ఇవ్వలేకపోయారు. వైసీపీ ప్రభుత్వంలో మూడేళ్లపాటు సోమశిలకు వరదలు రావడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. అప్పట్లో ఒక్కసారిగా కూడా కృష్ణా జలాలను సోమశిలకు తీసుకురాలేదు. అయితే ఎన్డీయే ప్రభుత్వం మాత్రం ముందుచూపుతో ఆలోచించి కృష్ణా జలాలతో సోమశిల, కండలేరులను నింపుతోంది. ఇప్పటి వరకూ దాదాపు 35 టీఎంసీల నీరు శ్రీశైలం నుంచి సోమశిలకు చేరినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరో మూడు వారాల పాటు ఇదే మాదిరిగా ఇన్‌ఫ్లో కొనసాగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే మరో 30 టీఎంసీలకుపైగా నీరు వచ్చే అవకాశముంది. ఈ నీటితో వచ్చే ఏడాది రెండో పంట కూడా సాగు చేసేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా 2018లో కూడా ఇదే మాదిరిగా కృష్ణా జలాలను జిల్లాకు తీసుకొచ్చి నాటి టీడీపీ ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవడం గమనార్హం.

వరద బాధితులకు చేయూత

నెల్లూరు (సాంస్కృతికం) : బెజవాడ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు తరలివస్తున్నారు. కొందరు నగదు అందజేస్తుండగా, ఇంకొందరు ఆహారం, బిస్కెట్లు, మంచినీటి ప్యాకెట్లు సేకరించి, పంపిస్తున్నారు. నెల్లూరుజిల్లా బులియన్ అండ్ డైమండ్స్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు గురువారం రూ.5 లక్షలు విరాళం అందజేశారు. ఈ చెక్కును జీఎస్టీ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శాంతిలాల్ జైన్, ప్రధాన కార్యదర్శి ఆర్కాట్ శ్రీనివాసులు, కోశాధికారి కైలాస్‌జైన్, జాయింట్ సెక్రటరీ లీలాధర్‌రెడ్డి, సలహాదారులు ఆంజనేయులు, జె.సత్యనారాయణ, అలిమెలి సుబ్రహ్మణ్యంల బృందం అందజేసింది.

● 3వ డివిజన్ ప్రశాంతి నగర్ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో 100 బస్తాల బియ్యాన్ని తరలించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసు లురెడ్డి వాహనానికి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు.

● నగరంలోని 20వ డివిజన్‌కు చెందిన పమిడి శ్రీనివాసులు, ఆయన కుమారులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చేజర్ల మహేష్‌బాబు పాల్గొన్నారు.

● టీడీపీ వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో దర్శి హరికృష్ణ రూ.20 వేల బిస్కట్ ప్యాకెట్లను విజయవాడ వరద సహాయ కేంద్రానికి పంపినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

● నెల్లూరు(హరనాథపురం) : జిల్లా రిటైర్డు రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు రూ.1,10,116 చెక్కును కలెక్టర్ ఆనంద్‌కు అందజేశారు. ఆ అసోసియేషన్ ట్రెజరర్ నంబూరు మస్తానయ్య మరో రూ.15వేలు అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్య క్షుడు ముత్యం నరసింహులు, వెంకట సుధాకర్‌రావు, మస్తానయ్య, జనార్ధన్‌రావు, కృష్ణారావు పాల్గొన్నారు.

● కలెక్టరేట్‌లోని డీఎస్వో కార్యాలయానికి చేరుకున్న ఆహార పదార్థాలను గురువారం ప్రత్యేక వాహనాల ద్వారా తరలించారు. 66 వేల వాటర్ బాటిళ్లు, 35 వేల వాటర్ ప్యాకెట్లు, 33వేల అగ్గిపెట్టెలు, 20,160 కొవ్వొత్తులు, 50000 బిస్కట్ ప్యాకెట్లను సేకరించి పంపించారు. డీఎస్వో రమణ, తహసీల్దారు రాజశేఖర్ పాల్గొన్నారు.



రూ.5లక్షలు విరాళం అందజేస్తున్న బులియన్ మర్చంట్స్

విజిలెన్స్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు,(క్రైం): జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా పీఆర్ రాజేంద్రకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో జిల్లాలో నెల్లూరు రైల్వే డీఎస్పీగా, సీఐడీ ఏఎస్పీగా పనిచేశారు. నూతనం గా బాధ్యతలు స్వీకరించిన రాజేంద్ర కుమర్‌కు సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజేంద్రకుమార్

పంచాయతీ కార్యదర్శులకు 11 నుంచి బదిలీల కౌన్సెలింగ్

నెల్లూరు, (జడ్పీ) : జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు ఈ నెల 11, 12వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీపీవో సుస్మితారెడ్డి ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5కి సంబంధించి దరఖాస్తు చేసుకున్న 160 మందికి 11న ఉదయం 10 గంటల నుంచి జడ్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. గ్రేడ్-4కి సంబంధించి 176 మంది దరకాస్తు చేసుకోగా, 12న ఉదయం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంటికి తాళం వేస్తే..

క్షణాల్లో దోచేస్తున్నారు..!

- పట్టపగలే వరుస చోరీలు
- బెంబేలెత్తుతున్న కావలి వాసులు
- నిత్యం దొంగల రెక్కీ
- నిద్రమత్తులో పోలీసులు

కావలి, సెప్టెంబరు 5: నిఘా నేత్రాలతో నేరాలను అరి కట్టాల్సిన పోలీసు యంత్రాంగం నిద్రమత్తులో జోగుతుండగా నిత్యం రెక్కీ నిర్వహిస్తున్న దొం గలు మాత్రం ఇంటికి తాళం వేస్తే మరుక్షణం దోచేస్తున్నారు. దీనిని బట్టి దొంగలు ఎంత అప్రత్తంగా రెక్కీ నిర్వహిస్తున్నరో అర్థమవుతోంది. పట్టపగలు వరు స చోరీలు జరుగుతున్నా పోలీ సులు అరికట్ట లేకపోతుండడంతో పట్టణ ప్రజలు కంటిమీద కునుకులేకుండా బెంబేలెత్తుతున్నారు. ఈ క్రమంలో ఇళ్లకు తాళాలు వేసి గుడి, బడి, ఆసుపత్రి, కూరగాయల మార్కెట్, బజారు, ఇతర పనులపై బయటకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. గతంలో ఇళ్లకు తాళాలు వేసి బయట ఊర్లకు వెళ్లితే వారు వచ్చేలోపు ఏ అర్ధరాత్రి సమయంలో ఆ ఇళ్లలో దొంగలు పడి దోచుకునే వారు. దీంతో తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు ఇళ్లలో పెద్దగా సొమ్ము ఉంచకుండా జాగ్రత్త పడుతుండేవారు. ఆ విషయం తెలుసుకున్న దొంగలు సొమ్ము దొరికే ఇళ్లను ఎంచుకుని పట్టపగలే దోచుకుపోతున్నారు. ఇలాంటి సంఘటనలు కావలిపట్టణంలో ఈ వారంలో మూడు చోట్ల జరిగాయి. నేరాలు అదుపు చేయాల్సిన పోలీసులు నిద్ర మత్తులో ఉండటంతో తాళ్లం వేసిన ఇళ్లను గంటా, రెండు గంటల వ్యవధిలోనే దోచుకుని పోతున్నారు.

● విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న పులిమి వేణుగోపాలరెడ్డి కావలి పట్టణం ముసునూ రులో నివాసం ఉంటున్నారు. ఆగస్టు 28న ఉదయం ఆయన విధులకు వెళ్లిన తర్వాత ఆయ న సతీమణి మధుస్మిత ఉదయం 9 గంటలకు గుడికి వెళ్లి తిరిగి 10 గంటలకే ఇంటికి వ చ్చింది. అప్పటికే ఇంటి తలుపులు పగుల కొట్టి దొంగలు ఇంట్లో ఉన్న సుమారు 16 సవర్ల బంగారు ఆభరణాలను దోచుకువెళ్లారు. వారు కూడా రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

● కావలి పట్టణం బుడంగుంటకు చెందిన గుండాబత్తిన మాలకొండయ్య ఈ నెల 2వ తేదీన కూలి పనులకు వెళ్లగా ఆయన భార్య ఇందిరమ్మ ఆరోగ్యం బాగా లేకపోవటంతో ఉదయం 11 గంటలకు ఆసుపత్రికి వెళ్లింది, మధ్యాహ్నం 1.45 గంటలకు తిరిగి ఇంటికి రాగా ఇంటి తలుపులు, బీరువా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. బంగారం, వెండి వస్తువులు తీసుకు వెళ్లి ఉండటంతో రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. కావలి పట్టణ ప్రజలను ఆందోళన కలిగిస్తున్న పట్టపగలు జరిగే చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● కావలిపట్టణం వెంగళరావునగర్‌కు చెందిన షేక్ రసూల్ ఆగస్టు 26న ఉదయం 9 గంటలకు ఇంటికి తాళం వేసుకుని తన భార్యను తీసుకుని కూరగాయల మార్కెట్ వద్ద వదిలి తన గోల్డ్‌షాపు వర్క్ వద్దకు వెళ్లారు. ఆమె కూరగాయలు తీసుకుని ఉదయం 11 గంటలకు ఇంటికి వెళ్లే సరికి దొంగలు ఇంటి తాళాలు పగుల కొట్టి ఇంట్లో ఉన్న సుమారు 16 సవర్లకు పైబడి బంగారు ఆభరణాలను దోచుకు వెళ్లారు. దీంతో వారు లబోదిబో మంటూ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లారీ బోల్తా : 1500 కోళ్లు మృత్యువాత



లారీ బోల్తాపడడంతో మృత్యువాత పడిన కోళ్లు

పొదలకూరు, సెప్టెంబరు 5 : బ్రాయిలర్ కోళ్ల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడడంతో సుమారు 1500 కోళ్లు మృత్యువాత పడిన సంఘటన మండలంలోని బొంత రాజుపాలెం వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రాపూరు నుంచి నెల్లూరు వైపు కోళ్ల లోడుతో వెళ్తున్న లారీ మండలంలోని బొంతరాజుపాలెం వద్ద బోల్తా పడింది. దీంతో కొద్దిసేపు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జేసీబీ సహాయంతో రోడ్డుపై అడ్డంగా పడి వున్న లారీని పక్కకు తీశారు.

చవితి ఉత్సవాలపై మాట్లాడి వస్తూ మృత్యు ఒడికి..

● రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నెల్లూరు,(క్రైం), సెప్టెంబరు 5: వినాయక చవితి ఉత్సవాలను ఏ విధంగా చేయా లి అన్న దానిపై స్నేహితులతో చర్చించి తిరిగి ఇంటికి బైక్‌పై వెళుతున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. నెల్లూరు నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... పొదలకూరు రోడ్డు నేతాజీ నగర్‌లో రమేష్‌నాయుడు కుటుంబం నివసిస్తోంది. ఆయన కుమారుడు బోయపాటి సతీష్(26) సాఫ్ట్‌వేర్ ఇంజ నీర్‌గా విధులు నిర్వహిస్తూ ఐదు నెలలుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. బుధవారం అర్ధ రాత్రి నగరంలోని అనిల్ గార్డెన్స్ వద్ద స్నేహితులతో కలిసి వినాయక చవితి ఉత్సవాల గురించి చర్చించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ముగ్ధా షోరూమ్ వద్ద వేగంగా బైక్ నడుపుతూ డివైడర్‌ను ఢీకొనడంతో బైక్‌పై నుంచి కిందపడ్డాడు. తలకు తీవ్రగా యాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో అక్కడకు చేరుకున్న సిబ్బంది అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. సమాచారం అందుకున్న నార్త్‌ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్‌లో

రూ.వందల కోట్ల దోపిడీ

- ఫోర్జరీ సంతకాలది స్కాంకాదు
- ఒరిజనల్ సంతకాలతోనే దోచుకున్నారు
- ఇద్దరు ఐఏఎస్, డిప్యూటీ కమిషనర్ల పాత్ర కీలకం
- టీడీపీ నాయకుడు ఆనం వెంకట రమణారెడ్డి
- 140కిగాను 73 ఫైల్స్‌కు ఆధారాలు కలెక్టర్‌కు అందజేత

నెల్లూరు(సిటీ),సెప్టెంబరు 5 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన నెల్లూరు కార్పొరేషన్‌లో ఐఏఎస్ అధికారి సంతకాల ఫోర్జరీ కేసులో స్కాం వాస్తవం కాదని, ఒరిజనల్ సంతకాల తోనే భవనాలకు అక్రమ అనుమతులు ఇచ్చారని టీడీపీ రాష్ట్ర నేత ఆనం వెంకట రమణారెడ్డి ఆరోపించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఓ ఆనంద్‌తో ఆయన భేటీ అయ్యారు. 140కి పైగా ఫైల్ ద్వారా భవనాలకు ఓసీ, మార్టిగేజ్‌ను నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేశారని, అందులో 73 ఫైల్స్‌కు సంబంధించిన ఆధారాలు కలెక్టర్‌కు అందచేశానని చెప్పారు. వందల కోట్లు కుంభకోణం కార్పొరేషన్‌లోని సిటీ ప్లానింగ్ విభాగం ద్వారా జరిగిందని ఆరోపించారు. ఇందులో గత కమిషనర్లు డీ హరిత, వికాస్ మర్మత్‌తోపాటు ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ చెన్నుడు కీలక పాత్రపోషించారని తెలిపారు. ఈ మేరకు స్పష్టమైన ఆధారాలు తనకు లభించాయని, వాటిని కలెక్టర్‌కు అందచేసినట్లు చెప్పారు. 2019-24 సంవత్సరాల మధ్య ఈ భారీ ఆర్థిక కుంభకోణం జరిగిందన్నారు. అది బయటపడుతుందన్న భయంతోనే ఫోర్జరీ స్కాంను వెలుగులోకి తీసుకువచ్చారని తెలిపారు. గత కమిషనర్ వికాస్ మర్మత్ మరింత బరితెగించి కార్పొరేషన్‌కు సంబంధం లేని తమ్మినేని భరత్‌రాజు అనే వ్యక్తి ద్వారా మార్టిగేజ్‌లను విడుదల చేయించారని దుయ్యపట్టారు. ఈ భారీ కుంభకోణంలో రిజిస్ట్రేషన్ అధికారుల పాత్ర అనుమానాస్పదంగా ఉందన్నారు. కలెక్టర్ స్థాయిలో లోతైన విచారణ చేపట్టాలని, లేకపోతే తాను హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. తనకు దొరికినన్ని ఆధారాలు ఫోర్జరీ కేసును విచారిస్తున్న పోలీసులకు లభించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

వీరంగం చేసిన హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కలువాయి, సెప్టెంబరు 5 : స్థానిక పోలీసు స్టేషన్‌లో మద్యం మత్తులో వీరంగం చేసిన హెడ్ కానిస్టేబుల్ ఎస్.జేమ్స్‌ను గురువారం ఎస్పీ జి.కృష్ణ కాంత్ సస్పెండ్ చేశారు. బుధవారం డ్యూటీ విషయం అడిగినందుకు మద్యం సేవిం చిన జేమ్స్ తనపై దాడి చేశారని మరో హెడ్ కానిస్టేబుల్ రమణయ్య రాపూరు సీఐ విజయకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు సీఐ కలువాయి స్టేష న్‌కు విచారణ కోసం చేరుకున్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించేందుకు ఎస్ఐ సుమన్ కూడా ఇక్కడకు వచ్చారు. రమణయ్యపై దాడి విషయం సీఐ అడగ డంతో జేమ్స్ స్టేషన్‌లో నానా రభస చేశారు. సీఐ, ఎస్ఐలతో కూడా దురుసుగా ప్రవర్తించారు. ఈ విషయం ఉన్నాతాధికారులకు సీఐ సమాచారం ఇచ్చారు. బుధవారం రాత్రి ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ కలువాయికి చేరుకుని ఈ ఘటనపై విచా రణ చేశారు. ఈ నేపథ్యంలో జేమ్స్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉన్నాతాధికారులు చర్యలు తీసుకున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	107
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6920
వెండి కిలో ధర	రూ. 85,200
వెండి ఒక గ్రాము	రూ. 88.20



వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులపై అందరిచూపు నెలకొంది. ఎమ్మెల్యేలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ దగ్గరగా ఉంటున్న నాయకులు ఈ పదవుల కోసం ఆశపడుతున్నట్లు తెలుస్తోంది. రిజర్వేషన్ల ప్రాతిపదికన చైర్మన్ పదవుల నియామకం జరుగుతుండటంతో తమకి కాకపోతే తమ మద్దతుదారులకైనా ఇవ్వాలని ముందుగానే పట్టుబడుతున్నారు. జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా అన్ని చోట్లా చైర్మన్ పదవులకు మంచి డిమాండ్ ఉండే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

ఏఎంసీలపై గురి!

- చైర్మన్, ఇతర పదవులపై ఆశావహుల పోటీ
- ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 5 : వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవుల కోసం ఆశావహులు ఎదురు చూస్తు న్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఊహించని విజ యం సాధించిన నేపథ్యంలో నామినేటెడ్ పదవుల భర్తీకి కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అతి త్వరలోనే పదవుల భర్తీ జరుగు తుందని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఏఎంసీలపై ఆశావహుల కన్నుపడింది. రైతులతో నేరుగా సత్సంబంధాలు కలిగిన పదవి కావడంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఎమ్మెల్యేలతో నియోజకవర్గ స్థాయి నాయకులు ఇప్పటికే చర్చలు కూడా పూర్తి చేసినట్లు తెలుస్తోంది. చైర్మన్ పదవులతోపాటు వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులకూ పోటీ ఎక్కువైంది.

● రిజర్వేషన్ల ప్రాతిపదికనే భర్తీ

ఏఎంసీ చైర్మన్ పదవులు రిజర్వేషన్ ప్రాతిపదికనే భర్తీ అయ్యే అవకాశం ఉంది. నెల్లూరు, కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు, కందుకూరు, సర్వేపల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నెల్లూరు ఏఎం సీకి ఓసీ జనరల్, కోవూరుకు ఎస్టీ మహిళ, సర్వేపల్లికి ఓసీ జనరల్, కావలికి బీసీ జనరల్, ఉదయగిరికి ఓసీ మహిళ, రాపూరుకు బీసీ జనరల్, ఆత్మకూరుకు మైనారిటీ మహిళ, కందుకూరుకు ఎస్సీ మహిళకు కేటా యించారు. మొత్తం 8 ఏఎంసీలలో నాలుగు కమిటీలను మహిళలకు కేటాయించారు. అయితే మిగిలిన నాలుగు కూడా జనరల్ విభాగం కావడంతో నాయకుల మధ్య పోటీ నెలకొనే అవకాశం ఎక్కువగా ఉంది. తమకు కాకపోతే తమ ఇంట్లో మహిళలు, కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యేలు కూడా రిజర్వేషన్లను అడ్డుపెట్టుకుని తమ ముఖ్య అనుచరులకే ఇచ్చేందుకు అవకాశం లేకపోలేదు. ఒక్కో ఏఎంసీకి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులతో పాటు దాదాపు 10 డైరెక్టర్ పదవులకు పాలకవర్గంలో చోటు ఉంటుంది. దీంతో ఇతర నాయకులు సైతం పదవుల కోసం ఎదురుచూస్తున్నారు.

రోగులు సరే.. వైద్యులేరీ!?

- ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వ్యాధిగ్రస్థుల తాకిడి
- డాక్టర్ల కొరతతో తప్పని ఇబ్బందులు

ఆత్మకూరు, సెప్టెంబరు 5 : మెట్టప్రాంతవాసులకు ఆరోగ్య వరప్రసాదిని అయిన ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు కరువయ్యారు. ఆశించిన స్థాయిలో డాక్టర్లు లేకపోవడంతో వ్యాధిగ్రస్థులు నెల్లూరుకు పరుగులు తీస్తున్నారు. సగటున రోజుకు 800 మందికిపైగా ఈ ఆసుపత్రికి వస్తుండగా 150 పడకలకు 100 పడకలు మాత్రమే ఉన్నాయి. అలాగే సివిల్ సర్జన్, జనరల్ ఫిజిషియన్ వంటి డాక్టర్లు లేకపోవడంతో ప్రసవాలకు ఇబ్బందిగా మారింది.

ముఖ్య విభాగాల్లోనే కొరత

ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ముఖ్య విభాగాల్లో డాక్టర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఏకంగా 10 పోస్టుల వరకు ఖాళీగా ఉన్నాయి. అందులో సివిల్ సర్జన్ పోస్టులు 5, డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టు ఒకటి, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 4 ఖాళీగా ఉన్నాయి. దంత, ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. గైనకాలజీ విభాగంలో ముగ్గురు డాక్టర్లకు ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఈ జిల్లా వైద్యశాలలో నెలకు సరాసరిన 170 ప్రసవాలు జరగాల్సి ఉండగా 120 నుంచి 130 ప్రసవాలు జరుగుతున్నాయి. కష్టతరమైన కాన్పులను నెల్లూరులోని జీజీహెచ్‌కు రెఫర్ చేస్తున్నారు. వైద్యశాలలో ఇద్దరు సివిల్ సర్జన్లు, ఒక అసిస్టెంట్ సివిల్ సర్జన్ ఉండాల్సి ఉండగా సివిల్ సర్జన్ పోస్టు ఖాళీగా ఉంది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, ఉన్నతాధికా రులు స్పందించి ఖాళీ పోస్టులు భర్తీ చేస్తే ఆత్మకూరు, ఉదయగిరి నియోజక వర్గాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.



ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాల



ఆసుపత్రిలో ఓపీ కోసం బారులు తీరి ఉన్న రోగులు



ఉన్నతాధికారులకు నివేదించాం

ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల కార్పొరేట్ వైద్యశాలకు ధీటుగా ఉంది. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. మందుల కొరత లేదు. త్వరలో ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ కూడా ఏర్పాటు చేస్తాం. కానీ వైద్యశాలలో 10 డాక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

- డాక్టర్ కేవీ.శేషారత్నం, సూపరింటెండెంట్

రైలు కిందపడి గుర్తుతెలియని మృతి

మనుబోలు, సెప్టెంబరు 5: మండలంలోని కొమ్మలపూడి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం 154వ కి.మీ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉండడాన్ని రైల్వే కీమెన్ గుర్తించారు. దీంతో వారి సమాచారం మేరకు రైల్వే ఎస్ఐ మాలకొండయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు నీలం రంగు చొక్కా, గ్రే కలర్ చారలు కలిగిన ప్యాంటు, మబ్బు రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు. కుడిభుజంపై సూర్యుడి టాటూ వేసుకుని ఉన్నాడు. అంతకుమించి మృతుడి వివరాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని, శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరుకు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్టీఆర్ వర్సిటీ పేరు మార్చినప్పుడు మాట్లాడలేదేం?

● మాజీ ఎంపీ మేకపాటిపై కోటంరెడ్డి ఆగ్రహం



బియ్యం వాహనానికి జెండా ఊపుతున్న కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 5 : వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎన్నో అరా చకాలు సృష్టించిందని.. ఎందరినో పొట్టన పెట్టుకుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివా సులు రెడ్డి అన్నారు. విజయ వాడ వరద బాధితులకు నెల్లూరులోని 3వ డివిజన్ ప్రశాంతి నగర్ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో 100 బస్తాల బియ్యాన్ని తీసుకువెళుతున్న వాహనాన్ని గురువారం కోటంరెడ్డి జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి రాష్ట్ర సీఎం చంద్రబాబును తిట్టటం హాస్యాస్ప దంగా ఉందన్నారు. గతంలో టీడీపీ పాలనలో సంగం బ్యారేజీకి అత్యధికంగా 70 శాతం నిధులిచ్చి పూర్తిచేస్తే దానికి వైసీపీ ప్రభుత్వం గౌతంరెడ్డి పేరుపెట్టిందని విమర్శించారు. ఇప్పుడు ఆ పేరు మారుస్తారని గగ్గోలు పెడుతున్నారని, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి పేరు మార్చినప్పుడు మేకపాటి ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితిలో మానవత్వం ఉన్న అందరూ ఏకం కావటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోకు రమణయ్య, కాకర్ల గోవర్ధన్, పాతూరి శైలజ, మల్లి, కృష్ణ, మధురెడ్డి, శ్రీనివాసులు, తులసి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల్లో ఎరువుల తయారీ : డీపీవో సుస్మితారెడ్డి

సంగం, సెప్టెంబరు 5: జిల్లాలోని 517 చెత్త సంపద కేంద్రాల్లో అక్టోబరు 2 నాటికి వినియోగంలోకి తెచ్చి ఎరువులు తయారు చేయాల న్నదే తమ లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి సుస్మితా రెడ్డి తెలిపారు. గురువారం ఆమె సంగం - కలిగిరి రహదారిలోని చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేసి కార్యదర్శులతో అక్కడే సమావేశం నిర్వహించారు. చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవడానికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ అప్పాజీ, అందరు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నెల కిందట వెళ్లి శవమై వచ్చాడు !

మర్రిపాడు, సెప్టెంబరు 5: ఇంటి నుండి వెళ్లిన పైలు వెంకటేశ్వర్లు (50) నెల రోజుల తరువాత గురువారం పక్క గ్రామ పొలాల్లో శవమై కనిపించాడు. డీసీపల్లి గ్రామానికి చెందిన ఈయన గొర్రెల వ్యాపారం చేసేవాడు. అప్పుల బాధతో ఆగస్టు 8న ఇంటి నుండి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవటంతో గతనెల 14న మర్రిపాడు పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈ క్రమంలో నందవరం పొలాల్లో కుళ్లిపోయిన మృతదేహాన్ని గమనించి రైతులు పోలీ సులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని కుటుంబసభ్యులకు సమా చారం ఇచ్చారు. మృతుడి ఒంటి మీద ఉన్న బట్టలను చూసి వెంకటేశ్వర్లుగా నిర్ధారించారు. ఘటన స్థలంలో పురుగుల మందు డబ్బా ఉండటంతో ఆత్మహత్య చేసు కొని ఉంటారని భావిస్తున్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 5: వ్యవసాయ సీజన్ ప్రారంభమవు తున్న దృష్ట్యా దుకాణాల యజమానులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు ముందులు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని దుకాణాల యజమానులతో సమీక్ష నిర్వహించారు. యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. దుకాణల వద్ద ధరల పట్టికను ఏర్పాటు చేయడంతో పాటు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో మండల వ్యవసాయ అధికారులు దుకాణాలను తనిఖీ చేసి స్టాకు, విక్రయ రికార్డులను పరిశీలించాలన్నారు. యజమానులు అవకతవకలకు పాల్పడితే అధికారులదే బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, చెన్నారెడ్డి, శేషగిరిరావు, మండల వ్యవసాయాధికారులు అంజనేయుల నాయక్, వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్, రవికుమార్ పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

పెన్నానదిలో అక్రమ నిర్మాణాలు ఆపండి

- కోవూరు ఏఈ వెంకటేశ్వర్లు
- భగత్‌సింగ్‌కాలనీలో నిర్మాణాల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 5 : పెన్నా నదిని ఆనుకొని ఎలాంటి అక్రమ నిర్మాణాలను చేపట్టరాదని కోవూరు ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు ఆదేశించారు. నగరంలోని భగత్‌సింగ్‌కాలనీలో పెన్నానదిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించి ఇళ్లు నిర్మించి విక్రయిస్తున్నారంటూ కబ్జా చేయడం... కట్టేయడం శీర్షికతో ఆంధ్రజ్యోతి గురువా రం ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో స్థానిక వీఆర్‌వోతో కల సి గురువారం ఆ ప్రాంతంలో ఏఈ పర్యటించారు. అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. అక్కడ నిర్మాణాలను వెంటనే ఆపాలని ఆదేశించారు. వరద ముంపు ప్రాంతాల్లో నివాసాల నిర్మాణం చేపట్ట కూడదని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ, జనసేన, వామపక్ష నాయకులు



కబ్జాకు గురైన స్థలాలను పరిశీలిస్తున్న జనసేన, టీడీపీ, వామపక్షాల నేతలు

నెల్లూరు, (స్టోన్‌హౌస్ పేట), సెప్టెంబరు 5: ప్రభుత్వ స్థలాలను ఎవరు ఆక్రమించినా చర్యలు తీసుకోవా లని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు అధికారులను కోరారు. గురువారం ఆంధ్రజ్యోతి ప్రచురిం చిన కథనానికి స్పందించిన టీడీపీ, జనసేన, వామపక్ష పార్టీల నాయకులు భగత్ సింగ్ కాలనీలో కబ్జాకు గురైన ప్రాంతాలను పరిశీలిం చారు. సుజయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయాలు జరిపారని ఆరోపించారు. ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 54వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి షేక్ జహీర్, జనసేన నాయకురాలు షేక్ ఆలియా తదితరులు పాల్గొన్నారు.

పెనుబర్తి సర్పంచి చెక్‌పవర్ రద్దు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 5 : మండలంలోని పెనుబర్తి గ్రామ సర్పంచ్ వెదనపర్తి సృజన చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఎం సుస్మిత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రానున్న మూడు నెలలు ఆమె పంచాయతీలో ఎలాంటి ఆర్థిక లావా దేవీలు నిర్వహించేందుకు వీలు లేకుండా నిషేధం విధిస్తున్నట్లు అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొ న్నారు. పంచాయతీలో అక్రమాలు జరిగినట్లు అదే గ్రామానికి చెందిన జస్వంత్ కుమార్‌రెడ్డితో పాటు ఇతరులు ఇచ్చిన ఫిర్యాదుపై డివిజన్ పంచాయతీ అధికారితో విచారణ నిర్వహించగా అవన్నీ వాస్తవాలేనని తేలిందని డీపీవో పేర్కొన్నారు. 2021-22, 2024-25 ఆర్థిక సంవత్స రాలకు సంబంధించి రూ. 30.13 లక్షలు సర్పంచ్ సృజన తన భర్త వెంకటేశ్వర్లురెడ్డి బ్యాంకు ఖాతాకు చట్టవిరుద్ధంగా బదిలీ చేశారన్నారు. రూ.12,860లు నిధులు ఖర్చు చేయగా అందుకు ఎలాంటి ఆధారాలు లేవని, సాధారణ నిధుల నుంచి రూ.7.86 లక్షలు సర్పంచ్ తన భర్త ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు రుజువు అయినందున ఆమె చెక్‌పవర్ రద్దు చేసి ఎంపీడీవో కార్యాలయం నుంచి పంచాయతీ ఆర్థిక లావాదేవీలు నిర్వ హించేందుకు ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు డీపీవో వివరించారు.

10న డీకేడబ్ల్యూ కళాశాలలో ఉద్యోగమేళా

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 5 : నెల్లూరులోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10వతేదీ ఉదయం 9 గంటలకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమేజాన్, ముత్తూట్ ఫైనాన్స్, కాంటినెంటల్ కాఫీ ఇండియా, అమర్ రాజా బ్యాటరీస్ కంపెనీలు మేళా నిర్వహించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని తెలిపారు. జిల్లాలో టెన్త్ నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లమో వరకు పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ 8639867407, 7989613024 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సమాజానికి మార్గనిర్దేశకులు టీచర్లే!

ఉపాధ్యాయ దినోత్సవంలో పలువురు వక్తలు ● డాక్టర్ 'సర్వేపల్లి'కి ఘననివాళి


లింగసముద్రం: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన తహసీల్దార్ సీతామహాలక్ష్మి, ఎంపీడీవో తదితరులు


ఉలవపాడు: రిటైర్డ్ డిప్యూటీ డీఈవోని సన్మానిస్తున్న వైఎస్ఆర్ బాహూజీ


అల్లూరు: ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈవో రవీంద్రనాథ్


కొండాపురం: సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు


కందుకూరు: ప్రకాశం ఇంజనీరింగ్ కాళాశాలలో కరస్పాండెంట్ రామయ్యను సన్మానిస్తున్న అధ్యాపకులు


విట్రగుంట: మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ రాజారెడ్డి


ఆత్మకూరు: జ్యోతి ప్రజ్వళన చేస్తున్న ఎంవీ సుబ్బారెడ్డి

లింగసముద్రం, సెప్టెంబరు 5 : సమాజానికి మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి, ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో-2 శివకుమార్ అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కే మోహన్‌రావు, సీహెచ్ సుబ్బమ్మ, బీ నాగశ్రీ, కే రవి, ఎస్‌వీఎల్ నరసింహారావులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కే సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. లింగసముద్రం మండలంలోని పెంట్రాల యూపీ పాఠశాలలో గురువారం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కే మోహన్‌రావు,కే వెంకటేశ్వర్లును పూలమాలలు శాలువాలతో సన్మానించారు. మండలంలోని విశ్వనాథపురం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గౌడపేరు విజయ్‌కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఓ ఆనంద్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీఈవో రామారావు తదితరులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

ఉలవపాడు : మండలంలో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సీనియర్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. శాంతినికేతన్ స్కూల్లో జరిగిన వేడుకల్లో కందుకూరు రిటైర్డ్ డిప్యూటీ డీఈవో ప్రసాదరావుని కరస్పాండెంట్ వైఎస్ఆర్ బాహూజీ సత్కరించి అభినందనలు తెలిపారు.

వలేటివారిపాలెం : మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్‌లో ఎస్‌జీటీ టీచరుగా పనిచేస్తున్న ముతకని హనుమంతరావు గురుపూజోత్సవం సందర్భంగా గురువారం నెల్లూరు కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. హనుమంతరావుకు మండల యూటీఎఫ్ నాయకులు, ఎంఈవోలు, పలువురు సహోపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

అల్లూరు : ఎంఈవో కార్యాలయంలో గురువారం ఎంఈవో రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సత్కరించారు. మండలంలోని కే.ప్రభాకర్‌రావు, టీ .పద్మావతి, ఎం.జనార్దనయ్య, కే రజని, పీ హైమావతిలకు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండాపురం : డాక్టరు సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి సందర్భంగా గురువారం మండలంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయిన సీహెచ్.రమాదేవి, ఎస్.మురళీమోహన్, వీ మల్లికార్జునరావు, ఎమ్ వీ క్రిష్ణయ్య, అబ్దుల్ కుతుబ్, పీ హరనాథ్‌రెడ్డి లను ఎంఈవోలు కే రవికుమార్, ఆనందరావు తదితరులు సన్మానించారు.

కలిగిరి : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కర్తన అరుణ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నెల్లూరులో కలెక్టర్ ఆనంద్, మాజీ మంత్రి సోమిరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

కందుకూరు : ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో కేకు కట్‌చేసి ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవి కుమార్, ఆర్ అండ్‌డీ డీన్ డాక్టరు లక్ష్మణరావు, నాక్ ఇన్‌చార్జి కే సుబ్బారెడ్డి, హెచ్‌వోడీలు సూరియా షిహాబ్, ఎంఎం రాయుడు, జీ పున్నారావు, డాక్టరు శర్మ, డాక్టరు సురేష్, డాక్టర్ మీరా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. కందుకూరులోని అపుస్మా ఆధ్వర్యంలో గురువారం తిరుమల ఫంక్షన్ హాలులో వేడుకలు నిర్వహించారు. డిప్యూటీ డీఈవో రఘురామయ్య, ఎంఈవోలు అజయ్‌బాబు, సుబ్బారెడ్డి, అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల, నారాయణ, చైతన్య విద్యాసంస్థలలోనూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల్లో ప్రిన్సిపాల్ పీవీఎస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అధ్యాపకులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. తిప్ప డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, మండలంలోని పలు పాఠశాల్లో జరిగిన గురుపూజోత్సవాల్లో ఎంఈవోలు నరసింహారావు, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు. దగదర్తి మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

కావలిటౌన్ : పట్టణంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. మద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ టీవీ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ దామిశెట్టి సుదీర్ నాయుడు పాల్గొని రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని నలందా హైస్కూల్‌లో నలందా విద్యాసంస్థల డైరెక్టర్ ఎండీ వసీం ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్య అతిథిగా అన్నదాత మణి పాల్గొన్నారు. పెన్షనర్స్ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఆకు ల రమణయ్య అధ్యక్షతన జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో గురువులు ప్రసాదరావు, అన్నవరం వెంకటేశ్వర్లు, వరప్రసాద్, రెడ్డప్ప తదితరులను ఘనంగా సత్కరించారు.

జలదంకి : ఎంఈవో కార్యాలయంలో గురువారం గురుపూజోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ జీ. వెంకటరమణయ్య ముఖ్యఅతిథిగా హాజరై 12మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయం సిబ్బంది ఎంఈవో శ్రీధర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 నాగేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని అపస్మా సీనియర్ ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో గురువారం అపస్మా డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేత తుమ్మల చంద్రారెడ్డి, కృష్ణ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ పర్వతరెడ్డి రాణాప్రమోద్‌రెడ్డి, అపస్మా నేతలు సీహెచ్ రమణారెడ్డి, ఈగా భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలంరించాయి.

ఏఎస్ పేట: స్థానిక ఠాగూర్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణరెడ్డి, హెచ్‌ఎం దొరస్వామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వింజమూరు: నల్లగొండ్ల పంచాయతీలోని చౌటుపల్లి ప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలచెన్నయ్య, నరసింహులు పాల్గొన్నారు. పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు శాలువాలతో ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చలపతి, ఎస్‌ఎంసీ ఛైర్మన్ చిననాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్థానిక స్త్రీశక్తి భవనంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర నేత పీ చెంచలబాబుయాదవ్, ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు బీ.రామాంజనేయులు, రమణయ్య, ఎస్.ప్రశాంతకుమారి, ఎల్‌సీ విజయకుమార్, షేక్ సబియాసుల్తాన్‌బేగం, షేక్ జమీర్‌అహ్మద్, కేసీ మాలకొండయ్య, కె.రమణయ్యలకు ప్రశంసాప్రతాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు. అలాగే స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రొఫెసర్లు ఈ వేడుకలో పాల్గొన్నారు.

సీతారామపురం: ఎంఈవో మస్తాన్‌వలి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన వేడుకలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, సీతారామపురం సర్పంచి భాగ్యకుమారి పాల్గొన్నారు. అనంతరం మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానం చేసి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, కొండయ్య, షాజిదా, యూటీఎఫ్ నాయకులు భోగ్యం శ్రీనివాసులు, గొడ్లవేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సీతారామపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు సీహెచ్. పిచ్చయ్య పదో తరగతి ప్రతిభా విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వెంగయ్య, ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

అనంతసాగరం: మండలంలోని చిలకలమర్రిలో టీచర్లను విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన లక్ష్మీప్రసన్న, మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు ప్రతేకంగా సత్కరించారు. ఎంపీడీవో మధుసూదన్‌రావు ఎంఈవోలు జానకీరాం, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మర్రిపాడు: స్థానిక బాలుపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలదండులు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో దనలక్ష్మీ, గ్రంధపాలకుడు నారాయణరావు, హెచ్‌ఎం రఫీ, ఉపాధ్యాయులు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.


కావలి: నలందాలో ఉపాధ్యాయినిని సత్కరిస్తున్న మణి తదితరులు


జలదంకి: ఎంఈవో శ్రీధర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


వింజమూరు: రాధాకృష్ణన్‌కు నివాళులర్పించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు


ఉదయగిరి రూరల్: సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు


సీతారామపురం: ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఏఎస్‌పేట: ఉపాధ్యాయుడికి బహుమతులు అందజేస్తున్న విద్యార్థులు


మర్రిపాడు: రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

వరికుంటపాడు : పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చలపతి, ఎస్‌ఎంసీ ఛైర్మన్ చిననాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

కలువాయి: మండల ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 జీ.శేషగిరిరావు, నాయకులు టీడీపీ మండల కన్వీనర్ జీ.వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా శ్రీనివాసులరెడ్డి, ఏ.వేణుగోపాల్‌రెడ్డి, పీర్ల సోమయ్య యాదవ్, జగదల్ నాయుడు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ కలువాయి సబ్‌బ్రాంచ్ ఛైర్మన్ జీ.పెంచలపుల్లయ్య ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

సంగం: స్థానిక జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను హెచ్‌ఎం సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీషు ఉపాధ్యాయుడు సీహెచ్ వెంకటేశ్వర్లును సత్కరించారు. అలాగే గాంధీ జనసంఘం జడ్పీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డిని సన్మానించారు.


వరికుంటపాడు: సంబరాలు జరుపుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


సంగం: మాజీ ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వరద బాధితుల సహాయక చర్యల్లో ఎమ్మెల్యేలు


బాధితులతో ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, సెప్టెంబరు 5: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, యువ నాయకుడు మంత్రి నారా లోకేష్‌ల ఆదేశాల మేరకు విజయవాడలోని 7వ డివిజన్‌లో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఉదయగిరి ఎమ్మెల్యే కాకార్ల సురేష్ వరద బాధితులకు సహాయక చర్యలు చేపడుతున్నారు. గురువారం అల్లూరి పరమాత్మవీధి, బందుల దొడ్డి సెంటర్, చంద్రనాగేశ్వరరావునగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తూ చంద్రన్న ఆదుకుంటాడంటూ స్థానికులకు భరోసా ఇచ్చారు. మానవతాదృక్పధంతో ఎంతో మంది విరాళాలు ప్రకటిస్తున్నారని, మిగిలిన వారు కూడా మీకు తోచిన విధంగా విరాళాలు అందించి ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గం టీడీపీ ప్రధాన కార్యాలయ ప్రతి నిధులు మాలపాటి చైతన్య, కనకదుర్గదేవి మాజీ ఈవో సూర్యకుమారి (ఐఏఎస్), ఏడో డివిజన్ పార్టీ ప్రెసిడెంట్ పడమటి సతీష్, బెల్లంకొండ రమణ, సాయి సాత్విక్ ఉన్నారు.

ఉదయగిరి రూరల్: విజయవాడ వరద బాధితులకు జలదంకి మండల టీడీపీ నాయకులు విరాళాలతో సేకరించిన నిత్యావసరాలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యాలయ ప్రతినిధులు మాలేపాటి చైతన్య, తిరుమలరెడ్డి, పెంచల నాయుడు, తుమ్మల కిరణ్ పాల్గొన్నారు.

కావలి: విజయవాడ వరద బాధితుల సేవలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డితో పాటు సంయుక్తసేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. విజయవాడ 17వ డివిజన్ బాధ్యతలు తీసుకున్న ఎమ్మెల్యే గత మూడు రోజులుగా అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి గురువారం దుస్తులు పంపిణీ చేశారు.


మంత్రితో కలిసి దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి

రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండండి

● సబ్ కలెక్టర్ శ్రీపూజ

లింగసముద్రం, సెప్టెంబరు 5: భారీవర్షాలు కురిసి రాళ్లపాడు ప్రాజెక్టులోకి వరద నీరు వస్తే ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం ఆమె ప్రాజెక్టును సందర్శించారు.ఈ సందర్భంగా డీఈలు లక్ష్మీనారాయణ, హజరత్తయ్య ప్రాజెక్టు గురించి ఆమెకు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులని, ప్రస్తుతం 6.9అడుగుల నీటిమట్టం ఉందని వారు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిగా వర్షాధారమైన ప్రాజెక్టని చెప్పారు. అలాగే కొత్త స్పిల్‌వే నుంచి 1.50 లక్షలు, పాత స్పిల్‌వే నుంచి 1 లక్ష కూసెక్కుల నీరు విడుదల చేయవచ్చని చెప్పారు. అనంతరం ఆమె కొత్త స్పిల్‌వే హయ్యస్ట్ బ్రిడ్జిపైకి ఎక్కి పరిశీలించారు.

● ప్రజా సమస్యలను పరిష్కరించండి

అంతకుముందు ఆమె లింగసముద్రం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.ప్రజల అర్జీలను పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ టీ ప్రసాద్, ప్రాజెక్టు ఏఈలు, జేఈలు చంద్రమౌళి, సీతారామయ్య, సింధూజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ స్టేషన్ల తనిఖీ

బిట్రగుంట, సెప్టెంబరు 5: బోగోలు మండలం కప్పరాళ్ళ తిప్ప, దగదర్తి పోలీస్‌స్టేషన్లను ఎస్పీ కృష్ణకాంత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ల పరిధిలోని పెండింగ్ కేసులపై ఆరా తీశారు, పాత, కొత్త నేరస్థుల రికార్డులను పరిశీలించారు. పాతనేరస్థుల కదలికలపై నిఘా ఉంచి, శాంతిభద్రతలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కావలి డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ పాపారావులను ఆదేశించారు. కార్యక్రమంలో దగదర్తి ఎస్సై కుమార్, తిప్ప ఏఎస్సై సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్లాంటు నిర్మాణానికి భూమిపూజ

లింగసముద్రం, సెప్టెంబరు 5: స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మంచినీరు అందించేందుకు జనసేన మండల అధ్యక్షుడు అంగులూరి నరషింహారావు గురువారం వాటర్ ప్లాంటు షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. నరసింహారావు తలిదండ్రులు రమణయ్య, లక్ష్మమ్మల జ్ఞాపకార్థం ప్లాంటు నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్ర మంలో హెచ్‌ఎం యూ. మాధవరావు, జనసేన నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర, రత్తయ్య, శ్రీను పాల్గొన్నారు.

పదార్థాల తయారీపై శిక్షణ

కందుకూరు, సెప్టెంబరు 5: పండ్లు, కూరగాయలతో విలువ ఆధారిత పదార్థాల తయారీపై కేవీకే గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టరు నిహారిక ఆధ్వర్యంలో గురువారం పలుకూరులో మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వివి ధరకాల పండ్లుతో బెల్లం, చక్కెరతో పనిలేకుండా మిఠాయిలు తయారుచేయటంపై అవగాహన కల్పించారు.

నవధాన్యాల విత్తనాలు పంపిణీ

అల్లూరు, సెప్టెంబరు 5: పచ్చిరొట్ట విత్తనాలకు బదులుగా నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి ఎస్.శ్రీహరినారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలకు బదులుగా నవధాన్యాల విత్తనాలను పచ్చిరొట్ట పైర్లుగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం పంపిణీ చేపట్టిందన్నారు. అల్లూరు గోదాముల్లోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం పంపిణీ చేస్తామన్నారు. 80శాతం రాయితీతో విత్తనాలు అందచేస్తామన్నారు.

తృణధాన్యాలు తప్పనిసరి

వలేటివారిపాలెం: గర్భిణీలు, బాలింతలు రోజువారీ ఆహారంలో తృణధాన్యాలు తప్పనసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. అత్తింటవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భరతలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్త రాధ తదితరులు పాల్గొన్నారు.

వరదలపై జగన్ విమర్శలు సిగ్గుచేటు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 5: విజయవాడలో వచ్చిన వరదలపై జగన్ విమర్శలు చేయడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ గుర్తుచేశారు. గురువారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో సంభవించిన వరదలతో పలు జిల్లాలు తీవ్ర నష్టం వాటిల్లితే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల కష్టాలు తెలుసుకొని వారి అవసరాలు దగ్గరుండి తీరుస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వరదలు సంభవిస్తే క్షేత్రస్థాయిలో పర్యటించకుండా జగన్ హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వేకే సరిపెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, రమణారెడ్డి, శివకృష్ణ పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

సీతారామపురం, సెప్టెంబరు 5: రంగనాయుడుపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం ఓ కారు బోల్తా పడింది. వివరాల మేరకు.. మర్రిపాడు మండలం ఏపిలిగుంట గ్రామానికి చెందిన శ్రీను కారులో వ్యక్తిగత పనుల నిమిత్తం సీతారామపురం వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో శ్రీనుకు ఎలాంటి గాయాలు కాలేదు. ఆ సమయంలో అటుగా వెళ్లే వాహనదారులు అతడిని కారులోంచి వెంటనే బయటకు తీశారు. కారు బ్రేకులు పడకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని శ్రీను తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

సంగం, సెప్టెంబరు 5: వర్షాకాలం ప్రారంభమవడంతో ప్రస్తుతం వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి జిల్లా అదనపు వైద్యాధికారి ఖాదర్‌వలి సూచించారు. గురువారం ఆయన స్థానిక వైద్యశాలలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ టీకాలు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి, అశోక్ ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, సెప్టెంబరు 5 : వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగులో అక్రమంగా ఇసుక నింపుకుంటున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ షేక్ మహబూబ్ సుభానీ, సిబ్బంది గురువారం తెల్లవారుజామున మన్నేరులో ఇసుక నింపుకుంటున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్లు, డ్రైవర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితుడికి రిలీఫ్ కిట్ అందజేత

కావలి, సెప్టెంబరు 5: పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన మొగిలిగుండ్ల అంకయ్య పూరిల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి రెడ్‌క్రాస్‌కు అందిన సమాచారం మేరకు గురువారం బాధిత కుటుంబానికి రిలీఫ్ కిట్‌ను అందచేశారు. ఈ కిట్‌లో 35 పాత్రలు, టార్పాలిన్, రెండు దుప్పట్లు ఉన్నాయని రెడ్‌క్రాస్ విపత్తు నిర్వహణ విభాగ కన్వీనర్ బీద లక్ష్మీనంద తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది మధుసూదనరెడ్డి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

వలేటివారిపాలెం: సబ్సిడీపై కంది, మినుము విత్తనాలకు ఆయా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాదికారి హేమంత్‌భరత్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, దరఖాస్తుఫారం, మొబైల్ నెంబరుతో రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

వింజమూరు, సెప్టెంబరు 5: పట్టణంలోని ఆర్‌బీకే వన్‌లో ప్రకృతి వ్యవసాయంపై నాలుగు మండలాలకు గ్రామ వ్యవసాయ సహాయకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి ప్రారంభించారు. డీపీడీ శివనారాయణ, ఏడీఏ లక్ష్మీకుమారి, శాస్త్రవేత్త సురేఖ పాల్గొన్నారు.

లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి

మర్రిపాడు, సెప్టెంబరు 5: నందవరం ఆదర్శ పాఠశాల కెమిస్ట్రీ లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు గురువారం ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. మరోసారి పునరావృతం కాకుండా చూసుకుంటామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 5: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడలు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ పీడీ శివ నారాయణ తెలిపారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రం-1లో సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, జిల్లా ఉద్యానవన అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీపీ పీడీ శ్రీనివాసులు, ఏడీఏలు మారుతీదేవి, నర్సోజీరావు, శేషగిరిరావు, చెన్నారెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

కలిగిరి, సెప్టెంబరు 5: స్థానిక పీహెచ్‌సీని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో, టీబీ, లేప్రసీ నియంత్రణ అధికారి ఖాదర్‌వలి గురువారం సందర్శించారు. పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, జిల్లా టీబీ కోఆర్డినేటర్ శ్రావణ్, ఎస్‌టీఎల్‌ఎస్ శివ, ఎంఎల్‌హెచ్‌పీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో విద్యాబోధన

లింగసముద్రం, సెప్టెంబరు 5: చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను ఆటపాటలతో బోధన చేయాలని ఉలవపాడు సీడీపీవో అరుణ తెలిపారు. గురువారం పెదపవనిలోని 2, 3, మిట్టపాలెం, జంగాలపల్లి, మేదరమెట్లపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ పఖ్వాడను సూపర్‌వైజర్ నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్ర మంలో కార్యకర్తలు సుజాత, జ్యోతి, సుల్తానా ఉన్నారు.

గురువులకు వందనాలు

పలువురు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



పొదలకూరు: రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



వెంకటాచలం: సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

వెంకటాచలం, సెప్టెంబరు 5: స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ డాక్టర్ విజయభాస్కర్‌రావు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యాపకులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కె సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, కావలి కళాశాల ప్రిన్సిపాల్ టి వీరారెడ్డి పాల్గొన్నారు.

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో

మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాడభూషి సంపత్‌కుమార్‌ను అధ్యయన కేంద్రం సిబ్బంది సన్మానించారు.

సర్వేపల్లిలో రాధాకృష్ణన్ విగ్రహం ఏర్పాటు చేయాలి

వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద రాధాకృష్ణన్ చిత్రపటానికి సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడుతో కలిసి తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐ సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేదాయపాళెంలోని సోమిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలిసి సర్వేపల్లిలో డాక్టర్ రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు ఆయన పేరు మీద పార్క్ నిర్మించాలని వినతిపత్రం అందజేయగా తప్పకుండా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు బొబ్బేపల్లి తెలిపారు. కార్యక్రమంలో గుమినేని వాణిభవాని, మల్లికార్జున్, రహీమ్, శ్రీహరి, ఆస్తోటి రవి, అశోక్ తదితరులున్నారు.

● **ముత్తుకూరు:** మంచి చెప్పే మార్గనిర్దేశకులు ప్రతి ఒక్కరూ గురువులేనని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజే రావు అన్నారు. గురువారం పోర్టులో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పోర్టులో వివిధ విభాగాల్లో ట్రైనింగ్ టీచర్స్‌ను ఘనంగా సన్మానించారు. అదానీ వరల్డ్ స్కూల్, అదానీ విద్యామందిర్, పాఠశాలల్లో ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఓఓ రాజన్‌బాబు, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, అడ్మిన్ ఏజీఎం గంగాసతీష్, హెచ్ ఆర్ అసోసియేట్ మేనేజర్ సీహెచ్ శ్రీకాంత్, అడ్మిన్, పాల్గొన్నారు.

● **తోటపల్లిగూడూరు:** సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ చెరుకూరు సరళ పాల్గొని మండల స్థాయిలో సౌత్ ఆములూరు పాఠశాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన కె వసంతలక్ష్మీని అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చావా సుధారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అహ్మద్‌బాషా, ఉపాధ్యాయులు కె హెప్సి విద్యుల్లత, బి కృష్ణవేణి, ఎస్ఎంసీ ఛైర్మన్ ఆర్ సువార్త, వైస్ ఛైర్మన్ వి గిరిజకుమారి, గ్రామస్థులు, పాల్గొన్నారు.

● **మనుబోలు:** మండలంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న బి శ్రీనివాసులు, రామయ్య, సిహెచ్ ఇందిర, పి ఉమ, ఎస్ వెంకటసుబ్బయ్యలను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. వీరిని ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో రమేష్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ నాయకులు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

● **విడవలూరు:** మండలంలో పనిచేస్తున్న కావలి జాన్ సుందర్, కె మాధవి, సీహెచ్ వెంకటేశ్వర్లు, రాజశ్రీ, రాజేశ్వరమ్మలకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కొడవలూరు ఎస్సీసెల్ మాజీ మండలాధ్యక్షుడు తువ్వర ప్రవీణ్‌కుమార్, ఎంఈవో నాగపద్మిని, ఎంపీడీవో శ్రీనివాసులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

● **బుచ్చిరెడ్డిపాళెం:** ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం అభినందనీయమని సీఐ శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం బుచ్చిలోని ఎంఈఓ కార్యాలయంలో గురుపూజోత్సవం నిర్వహించి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్ గోదావరి రచయితల సంఘం అభినవ ఉపాధ్యాయ మిత్ర పురస్కారం అందుకోవడంపై ఎంఈఓలు, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఈఓలు దిలీప్‌కుమార్, వీవీ రత్నం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మురళి, రాజ్యలక్ష్మి, భారతి, సరస్వతి, మస్తానయ్య, పద్మ, ఆసియాబేగంలను ఘనంగా సత్కరించారు.

● **పొదలకూరు:** గురుపూజోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కె లక్ష్మీనారాయణ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యాపకులకు జ్ఞాపికలను అందజేశారు. అలాగే స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో విరువూరు(ఎస్సీ) ప్రధానోపాధ్యాయులు సీహెచ్ లక్ష్మీరాజ్యం, జె ప్రభుకుమారి (పొదలకూరు ప్రధానోపాధ్యాయులు), వాకాటి శ్రీనివాసులు (ఎస్‌జీటీ, కేకేపల్లి), ఎం కృష్ణయ్య (ఎస్‌జీటీ, కనుపర్తి ఎస్సీ) మధిర శ్రీనివాసులు (ఎస్‌జీటీ లింగంపల్లి, ఆర్ఆర్‌సీ), పూనుగుంట అరుణ (ఎస్‌జీటీ, ఇనుకుర్తి మెయిన్), డి ప్రతాప్ (సీఆర్ఎంటీ) ఎం కృష్ణయ్య (సీఆర్ఎంటీ)లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కె రేణుక, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

సైదాపురం: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురుపూజోత్సవ వేడుకల్లో భాగంగా క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి సన్మానించారు. ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఎంఈవోలు దయాకర్, సుప్రియ, డీటీ అనురాధ, ఎస్ఐ కాంతికుమార్ పాల్గొన్నారు.



ముత్తుకూరు: జ్ఞాపికలు ఇస్తున్న సీఈవో



బుచ్చిరెడ్డిపాళెం: ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంఈవోలు



విడవలూరు: ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న తువ్వర ప్రవీణ్

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



గీతాంజలి పాఠశాలలో..

తస్మై శ్రీ గురవే నమః

● ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 5 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు విద్యాసంస్థల్లో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని విద్యాసంస్థల అధినేతలు పేర్కొన్నారు.

● మాగుంటలేవుట్‌లోని విశ్వసాయి కళాశాల అన్నమయ్య క్యాంపస్‌లో సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ 1962లో కొంతమంది శిష్యులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వద్దకు వెళ్లి మేము మిమ్మల్ని గౌరవించుకుంటాం అని చెప్పగానే దేశంలో నేను ఒక్కడినే కాదు ప్రతి ఒక్క గురువును గౌరవించాలని సూచించారన్నారు. దీంతో ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా అమల్లోకి తీసుకువచ్చారని తెలిపారు. ఒక ఉపాధ్యాయుడిగా ఆదర్శవంతంగా జీవితాన్ని ప్రారంభించి దేశ రాష్ట్రపతి స్థానాన్ని అధిష్టించిన మహోన్నత వ్యక్తి రాధాకృష్ణన్ అని కొనియాడారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు.

● నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు కలిసి డాక్టర్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రసాయన శాస్త్ర అధ్యాపకురాలు రాధారాణిని సత్కరించారు. నరేష్, రమణారెడ్డి, మునిరాజు, చెంచయ్య, రవికృష్ణ పాల్గొన్నారు.

● కొండాయపాళెం నగర పాలక ప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, సోమశేఖర్‌రావు, విద్యావలంటీర్ రాశి పాల్గొన్నారు.

● సరస్వతినగర్ డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల్లో గురుపూజోత్సవం నిర్వహించారు. విద్యార్థులు రాధాకృష్ణన్, ఉపాధ్యాయుల వేషధారణలలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించి గురుభక్తిని చాటుకు న్నారు. సంస్థ జీఎం రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రపూర్ణ, జాస్మిన్, నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పొదలకూరురోడ్డులోని శ్రీ సింహపురి పాఠశాలలో కరస్పాండెంట్ వై మోహన్‌రాజు సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని, గొప్పతనాన్ని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియచేసి అందరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరి, శ్రీనివాస్, సుందరి, భాగ్యలక్ష్మి, శీనయ్య పాల్గొన్నారు.

● బాలాజీనగర్‌లోని శ్రీ గీతాంజలి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘనంగా నివాళులర్పించారు. కరస్పాండెంట్ వై వెంకట రామ య్య మాట్లాడుతూ అజ్ఞానమనే చీకటిని పారద్రోలి జ్ఞానాన్ని వెలిగించే వారే గురువులన్నారు. ఉపాధ్యాయులందరూ రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కే ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



డీకే ప్రభుత్వ కళాశాలలో..



సింహపురి పాఠశాలలో..

● డీకేడబ్ల్యూ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం స్ఫూర్తిదాయకమైనదన్నారు. అధ్యాపకులు ఆయనను ఆదర్శంగా తీసుకుని బాధ్యతాయుతమైన ప్రవర్తనతో విద్యార్థులను తీర్చిదిద్ది దేశభవితను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పీఎంవీ ప్రసాద్ పాల్గొన్నారు.

● నెల్లూరు రూరల్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయంలోని రాధాకృష్ణన్ విగ్రహం వద్ద గురుపూజోత్సవం నిర్వహించారు. ఎంఈవో అబ్దుల్ హమీద్, రిటైర్డ్ ఎంఈవో నరసయ్య, ఏపీపీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్‌బాషా, రూరల్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస సుబ్బయ్య, కార్యదర్శి విజ్ఞాన్ సుధాకర్, నేతలు షంషుద్దీన్, పీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా రామచంద్రయ్య యాదవ్

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 5 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఇందు కూరుపేట మండలం పీవీ కండ్రిగ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెవల రామచంద్రయ్య యాదవ్ కలెక్టర్ ఆనంద్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ తనది మర్రిపాడు మండలం, ఇర్లపాడు పంచాయతీ రాజులపాడు గ్రామమని చెప్పారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నతనం నుంచే విద్యలో రాణిస్తూ ఉపాధ్యాయుడిగా సేవలందించాలని నిర్ణయించుకున్నానన్నారు. అందరి ఆశీస్సులతో ఉపాధ్యాయుడిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నానన్నారు. ఉపాధ్యాయురాలైన తన సతీమణి ధనమ్మ ప్రోత్సాహం, సహకారంతో విద్యార్థులకు ఉత్తమ బోధనతోపాటు విజ్ఞానాన్ని, నైతిక విలువలను, ప్రకృతి పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాల్లో వారిని తీర్చిదిద్దుతున్నానని తెలిపారు. మున్ముందు మరింత బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 5 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఆశాఖ కార్యాలయంలో గురువారం విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 12 మంది ఉపాధ్యాయులను సత్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పీ వెంకయ్య, సభ్యులు పాల్గొన్నారు.

'శేషు'లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నెల్లూరు రూరల్ : బుజబుజనెల్లూరులోని శేషు స్కూల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కెనరా బ్యాంకు మేనేజర్ చైతన్య పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేకతను వివరించారు. టీచర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బీ శేషుయాదవ్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న స్కూల్ యాజమాన్యం

నేటి నుంచి వేళాంగిణి మాత ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన వేళాంగిణి మాత చర్చి

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 5: కొత్త కోడూరు సముద్ర తీరాన వెలసిన వేళాంగిణి మాత మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఈ మూడు రోజులు భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ యాజ మాన్యం తెలిపింది. 7వ తేదీన జపమాల- నవ దిన ప్రార్థనలు, ఆరాధన స్వస్థత ప్రార్థనలు గురు వులు జాన్ ఉపన్యాసం, పి జోసఫ్‌చే దివ్యబలి పూజ ఉంటుందని, 8న సింహపురి మేత్రాణులు డాక్టర్ ఎండి ప్రకాశంచే దివ్యబలి పూజలు నిర్వహిస్తున్నట్లు, పుణ్యక్షేత్ర కమిటీ నిర్వాహకులు ఫాదర్ సాగర్ పేర్కొన్నారు. మూడు రోజుల పాటు భక్తులకు ఉచిత భోజనంతో పాటు వసతులు కల్పిస్తున్నామని, పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటుచేస్తున్నామని పుణ్య క్షేత్రం డైరెక్టర్ లూకస్ రాజు తెలిపారు.

80 శాతం రాయితీపై నవధాన్యాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

ముత్తుకూరు, సెప్టెంబరు 5: ప్రభుత్వం 80 శాతం రాయితీపై నవ ధాన్యాలను అందిస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వంటపాలెం రైతు సేవా కేంద్రంలో గురువారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 1000 విలువ చేసే 10కేజీల నవధాన్యాల విత్తనాలను రైతులను రూ.200కే అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోత్స్నా రాణి, నాయకులు పల్లంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రైతులు, వ్యవసాయ సహాయకులు రమణమ్మ, పాల్గొ న్నారు.

డీఆర్ ఉత్తమ్‌లో 'చవితి' ప్రసాదాలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 5: వినాయక చవితి సందర్భంగా నగరంలోని డీఆర్ ఉత్తమ్ హోటల్‌లో సంప్రదాయ నైవేద్యాలు, గణేష్ నేతిలడ్డూను తక్కువ ధరకే అందిస్తున్నట్లు ఆ హోటల్ అధినేత కొడవలూరు ధనుంజయరెడ్డి ఓప్రకటనలో పేర్కొన్నారు. సంప్రదాయ ప్రసాదంలో మోకీలు, గారెలు, కుడుములు, కోవా మోదకాలు, బెల్లం పొంగలి, పులిహోర, గుగ్గిళ్లు, ప్యాకేజీని రూ.499, అలాగే గణేష్ లడ్డు, బూందీలడ్డు కేజీ రూ.400, ఘీ స్పెషల్ లడ్డు రూ.500, సన్నపూసలడ్డు రూ.500కు లభిస్తాయని తెలిపారు. ఆర్డరు మీద ఎన్ని కేజీల లడ్డూలు కావాలన్నా సరఫరా చేస్తామన్నారు. బుకింగ్ కోసం 92464 23401, 91006 02226 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఆర్డర్లు ఈనెల 7వతేదీ శనివారం ఉదయం 7నుంచి 11గంటల వరకు తీసుకుంటారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



మనుబోలులో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

మనుబోలు, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితుల సహాయార్థం గురువారం మనుబోలులో సీపీఎం నాయకులు విరాళాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వరదలతో ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తున్నామన్నారు. అనంతరం దుకాణాల వద్దకు వెళ్లి వ్యాపారుల నుంచి విరాళాలు సేకరించారు. కార్య క్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తలారి దేవదానం, నాయకులు బీసీ భాస్కర్ పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో బుచ్చి కమిషనర్



వరద సహాయక చర్యల్లో బుచ్చి కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం: విజయవాడ వరద బాధితుల కోసం చేపడుతున్న సహాయక చర్యల్లో బుచ్చి మున్సిపాలిటీ కమిషనర్ ఎల్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నా రు. గురువారం విజయవాడ కార్పొరేషన్‌లోని 62వ డివిజన్ పరిధిలోని పాయకాపురం, కండ్రిగ, హైవే పరిసర ప్రాంతాల్లో వరద బాధితులకు ఆహార పొట్లాలు, తాగునీరు అంద జేశారు. పడవల్లో వెళ్లి వరద సహాయక చర్యలు చేపట్టినట్టు కమిషనర్ తెలిపారు.

వైసీపీ అక్రమాలపై విచారించండి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 5 : గడిచిన ఐదేళ్లలో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలపై కూటమి ప్రభుత్వంలోనైనా విచారిస్తారా!? అని జొన్నవాడ సర్పంచు కందికట్టు పెంచలయ్య అధికారులను కోరారు. గురువారం జొన్నవాడలో ఆయన టీడీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఫాంహౌస్‌లు, జొన్నవాడ తిప్పలో గ్రావెల్, ఇసుక, కామాక్షితాయి ఆలయ భూముల ఆక్రమణ తదితర అవినీతి బాగోతాలపై ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అప్పట్లో అధికారులు పట్టించుకోలేదని మండిపడ్డారు. పైగా తనతోపాటు టీడీపీ నాయకులపైనే కేసులు పెట్టారన్నారు. ఈ అక్రమాలపై ఎమ్మెల్యే ప్రశాంతమ్మ వద్దకు వెళ్లి వివరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఉమ్మయ్యస్వామి, కే.సుబ్బారావు, పెంచలయ్య, సుధాకర్, రత్నం, హరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో కృష్ణపట్నం సహకార సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

ముత్తుకూరు, సెప్టెంబరు 5: సభ్యుల సహకారంతో కృష్ణ పట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధి పథంలో నడుస్తోందని పర్సన్ ఇన్‌చార్జ్ శివ కుమార్ తెలిపారు. ముత్తుకూరులోని కృష్ణపట్నం పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ సొసైటీ పరిధిలో రైతుల సంక్షేమం కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కృష్ణపట్నం సహకార సంఘం పైలెట్ ప్రాజెక్టు కింద కంప్యూటరీకరణకు ఎంపికైందన్నారు. సభ్యులంతా ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకాలతో తమ వివరాలను కంప్యూటరీకరణ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ మోహన్‌కృష్ణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నిర్మల, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరామిరెడ్డి, సూపర్‌వైజర్ ఇబ్రహీం, ఖలీల్, సంఘ సీఈఓ కె వెంకటాద్రి, సంఘ సిబ్బంది అమీర్‌జాన్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కృష్ణపట్నం సిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మృతి

ముత్తుకూరు, సెప్టెంబరు 5: కృష్ణపట్నం సిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పెద్దపాలెం సుబ్బయ్య గురువారం గుండెపోటుతో మృతిచెందారు. గతంలో కృష్ణపట్నం ఉపసర్పంచ్‌గా, ప్రస్తుతం సిద్ధేశ్వరస్వామి వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా సేవలందించారు. ఆయన మృతి టీడీపీకి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. సుబ్బయ్య మృతదేహానికి మండల టీడీపీ నాయకులు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పెన్షన్ భవన్‌లో...



సన్మాన గ్రహీతతో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన వాడే ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందుతారని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. గురు వారం భక్తవత్సలనగర్‌లోని పెన్షన్ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నిర్వ హించిన గురుపూజోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువు రు ఉపాధ్యాయులను సన్మానించారు. సంఘం అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, జిల్లా ట్రెజరీ అధికారి డీ గంగాద్రి, మాజీ డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ పెంచలరెడ్డి, డివిజనల్ సబ్‌రిజిస్ట్రార్ ఎస్‌కే అహ్మద్, సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్ మూర్తి, ఉపాధ్యక్షుడు గురునాథం పాల్గొన్నారు.

● సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రాంతి నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురు పూజోత్సవం జరిగింది. ఆర్డీవో మలోల, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీప్రసద్, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పెంచలరెడ్డి, నెరసం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, దగ్గుపాటి రాధాకృష్ణ తదితరులు రాధాకృష్ణన్ విగ్రహానికి పుష్పమాలలు వేసి నివా ళులర్పించారు. ఇటీవల ట్రస్ట్ అధ్యక్షుడు సర్వేపల్లి శ్రీరామమూర్తి మరణించడంతో 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు సర్వేపల్లి శివకుమార్, సతీష్‌చంద్ర, సురేష్‌కుమార్, బాల కృష్ణమూర్తి పర్యవేక్షించారు.



సర్వేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాధాకృష్ణన్‌కు నివాళి

నేటి సాయంత్రానికి ఘాట్ సిద్ధం చేయాలి : ఎమ్మెల్యే కోటంరెడ్డి



గణేష్ ఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం): స్వర్ణాల చెరువులో నిర్మించిన గణేష్ ఘాట్‌ను శుక్రవారం సాయంత్రం 6గంటలకల్లా అన్ని ఏర్పాట్లు, వసతులతో సిద్ధం చేయించాల్సిందేనని అధికారులను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. నగరంలో గణేష్ ఉత్సవ మండప నిర్వాహకులు ప్రభుత్వ అనుమతులు తీసుకుని, తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. హైదరాబాద్ తరహాలో శనివారం నుంచి గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నామని, 11వతేదీ సామూహిక గణేష్ నిమజ్జనోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిట్టు సత్యనాగేశ్వరరావు, బయ్యా వాసు, వేలూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన

నెల్లూరు రూరల్ : నగర శివారు ప్రాంతాల ప్రజలకు కనీస సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 31వ డివిజన్ పరిధిలో రూ.కోటి నిధులతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు గురువారం శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ బత్తల మంజుల, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు బత్తల కృష్ణ, మన్నేపల్లి రఘు, కూకటి హరిబాబు యాదవ్ పాల్గొన్నారు.

సుందరంగా గణేష్ ఘాట్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్వర్ణాల చెరువు తీరాన నిర్మించిన గణేష్ ఘాట్ సర్వాంగ సుందరంగా మారిందని జనసేన పార్టీ జిల్లా నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. ఆయన గురువారం ఘాట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లాయర్ శ్రీరామ్, కాకు మురళి, గుర్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో వైద్యుల రక్తదానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నేతలు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 5 : ఇండియన్ రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు. సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక స్థానం ఉందని తెలియచేశారు. అనంతరం ఫిజియోథెరపీడేని పురష్కరించుకుని వైద్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, సుబ్బా రెడ్డి, డాక్టర్ వాసు, డాక్టర్ నవీన్, డాక్టర్ అక్తర్, బలరామయ్య నాయుడు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

నెల్లూరు(వైద్యం): విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు మానవత్వంతో సహాయం చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు కోరారు. గురువారం సాయంత్రం గాంధీబొమ్మ, ట్రంక్‌రోడ్, కాపువీధి ప్రాంతాల్లో విరాళాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాంబాబు, సుధాకర్, మురళీ పాల్గొన్నారు.

వరద ప్రాంతంలో విద్యుత్‌శాఖ సిబ్బంది పనులు

నెల్లూరు(జడ్పీ): వరద తాకిడికి అతలాకుతలం అయిన విజయవాడ నగరంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగంగా చేపట్టడంలో జిల్లాలోని ఉద్యోగులు, సిబ్బంది భాగస్వాములు అయ్యారు. విజిలెన్స్ విభాగం ఈఈలు జగదీష్, సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం యుద్ధ ప్రాతిపదికన పనిచేసి ప్రజలకు విద్యుత్‌నిసరఫరా చేశారు.

జనసైనికుల సేవలు

నెల్లూరు(క్రైం): విజయవాడ వరద బాధితులకు అండగా ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్‌తో కలిసి నెల్లూరు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ సేవా కార్యక్రమాలు చేపట్టారు. గురువారం సింగ్ నగర్, గన్నవరం, రామవరప్పాడు ప్రాంతాల్లో ఆహార పొట్లలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.

జిల్లాలో రోడ్లు అభివృద్ధి చేయండి

● కేంద్ర అధికారికి వేమిరెడ్డి వినతి

నెల్లూరు(హరనాథపురం): జిల్లాలోని రహదారుల అభివృద్ధికి సహకరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం కేంద్ర రహదారుల అభివృద్ధి విభాగం డైరెక్టర్ జనరల్ సారంగికి ఢిల్లీలో వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలోని రోడ్లతోపాటు బుచ్చి-ఊటుకూరు రహదారి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఏకలవ్య పాఠశాల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖా మంత్రి జుయల్ ఓరమ్‌ను కలిసి కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను ఆయన నివాసంలో వేమిరెడ్డి కలిశారు. పలు అంశాలపై చర్చించారు.

వరద బాధితులకు సాయం చేద్దాం



చిల్లకూరు మండలం ఏరూరు సమీపంలోని సముద్రతీరప్రాంతంలో గురువారం సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ హెల్ప్ ఫ్లడ్ విక్టిమ్స్ విజయవాడ అనే నినాదంతో ఓ సైకతశిల్పాన్ని రూపొందించారు. విజయవాడ వరద బాధితులకు ప్రతిఒక్కరూ సాయం చేయాలని ఆకాంక్షిస్తూ ఈ శిల్పాన్ని రూపొందించడం జరిగిందన్నారు.

-చిల్లకూరు

సత్యవేడు ఎమ్మెల్యేకి షాక్

లైంగిక వేధింపుల ఆరోపణలపై టీడీపీ అధినేత తక్షణ చర్యలు

ఇదంతా కుట్ర అంటున్న ఆదిమూలం

మద్దతుగా నిలబడ్డ కుటుంబసభ్యులు



తిరుపతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):తనను లైంగికంగా వేధించారంటూ ఓ తెలుగు మహిళ నాయకురాలు చేసిన ఆరోపణల నేపథ్యంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని టీడీపీ నుంచీ సస్పెండ్ చేయాలని జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశించారు. దీంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు పార్టీ నుంచీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.తెలుగు మహిళ నాయకురాలు చేసిన ఆరోపణలను అధినేత సీరియస్‌గా తీసుకున్నారు. అందులో నిజానిజాలు, ఆరోపణల వెనుక ఇతర కోణాలు వంటివి ఏవైనా వుంటాయా అన్న విషయం కూడా అధినేత పరిగణనలోకి తీసుకోలేదు. మహిళా నేత నుంచీ తీవ్ర ఆరోపణ రావడంతో వరద సహాయక చర్యల్లో నిమగ్నమై వున్నా కూడా ఆ అంశంపై దృష్టి సారించారు.సస్పెన్షన్‌కు ఆదేశించిన అధినేత ఆరోపణల గురించి పార్టీపరంగా అంతర్గత విచారణకు ఆదేశించారు.గురువారం ఉదయం నుంచీ సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ఈ అంశం వైరల్ అవుతుండడంతో జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆత్మరక్షణ ధోరణిలో పడ్డాయి. అంతలోనే అధినేత స్పందించిన తీరు శ్రేణులను తలెత్తుకునేలా చేసింది. నిజానికి ఆరోపణలతో పార్టీ గ్రాఫ్ తగ్గాల్సిన పరిస్థితుల్లో అధినేత నిర్ణయం సామాన్య జనంలో కూడా పార్టీ ఇమేజిని పెంచింది.

తొలుత వ్యతిరేకించి... తర్వాత సమర్థించి

ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన తెలుగు మహిళ నాయకురాలు గత ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వడాన్ని వ్యతిరేకించారు.టీడీపీ టికెట్ డాక్టర్ హెలెన్‌కు కాకుండా ఆదిమూలానికి ప్రకటించడంతో నిరసించిన ఆమె తర్వాత సమర్థించారు. తీరా ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేయలేదని ఆదిమూలం నుంచే విమర్శలు ఎదుర్కొన్నారు. ఫలితాల తర్వాత ఎమ్మెల్యే వెంట నడిచారు. మూడు నెలలు కూడా గడవకనే అదే ఎమ్మెల్యే మీద లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. నాలుగైదు నెలల్లోనే పలు మలుపులు తిరిగిన ఈ వ్యవహారంలో కేంద్ర బిందువుగా మారిన ఆమెది కేవీబీపురం మండలం.2020లో అప్పటి సత్యవేడు టీడీపీ ఇంఛార్జి జేడీ రాజశేఖర్ అనుచరురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె తర్వాత డాక్టర్ హెలెన్ వర్గంలో చేరారు.ఆదిమూలానికి టికెట్ ప్రకటించాక ఆయన తరఫున ప్రచారం చేశారు.ఎన్నికల ఫలితాల తర్వాత ఎమ్మెల్యే వెంట కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చివరగా వారం కిందట కేవీబీపురంలో ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమానికి ఆమె గైర్హాజరయ్యారు. ఇలా వీరి రాజకీయ సంబంధాలు అనేక మలుపులు తిరిగాయి. ఈ నేపథ్యంలో ఆమె గురువారం అకస్మాత్తుగా హైదరాబాదులో మీడియా ఎదుట ఎమ్మెల్యేపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం కలకలం రేపింది.ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయ చరిత్రలో ఓ ఎమ్మెల్యే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొనడం, పార్టీ నుంచీ సస్పెండ్ కావడం ఇదే తొలిసారి. ఈ ఘటన జిల్లాకు తలవంపులుగా మారిందనే చెప్పాలి.

సర్పంచ్ నుంచి ఎదిగి.. ఒక్కసారిగా దిగజారి

సత్యవేడు, సెప్టెంబరు 5 : రాజకీయ ప్రస్థానంలో సర్పంచ్ స్థాయి నుంచి ఒక్కొక్క మెట్టు ఎదిగి ఎమ్మెల్యే స్థాయికి చేరుకున్న ఆదిమూలం ఒక్కసారిగా అప్రతిష్ట పాలయ్యారు.1978లో రాజకీయాల్లో అడుగు పెట్టిన ఆదిమూలం నారాయణవనం మండలంలోని తన స్వగ్రామం భీమునిచెరువు సర్పంచ్‌గా తొలిసారి 1980లో ఎన్నికయ్యారు. ఏకధాటిగా 15 సంవత్సరాలు సర్పంచ్‌గా కొనసాగారు. 1995 నుంచి 2006 వరకు వైస్ ఎంపీపీగా, జడ్పీటీసీగా ఎన్నికయ్యారు.2009 నియోజకవర్గ పునర్విభజనలో బాగంగా సత్యవేడు నియోజకవర్గంలో నారాయణవనం కలవడంతో టీడీపీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. తరువాత కాంగ్రెస్, వైసీపీలో కొనసాగారు. 2014 ఎన్నికల్లో సత్యవేడు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఆదిమూలం 2019 ఎన్నికల్లో గెలుపొందారు. 2024 ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి పెద్దిరెడ్డితో విభేదించి వైసీపీ నుంచి బయటకు వచ్చి టీడీపీలోకి చేరి టికెట్ సంపాదించారు.అయితే వైసీపీ ఎమ్మెల్యేగా ఐదేళ్ళ కాలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఆయన అక్రమ కేసులు పెట్టి వేధించారంటూ మెజారిటీ నాయకులు ఆయన అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో కొంతమంది టీడీపీ నాయకులు ఇండిపెండెంట్ అభ్యర్థి రమేష్‌బాబుకు పనిచేశారు.అయితే కూటమి ప్రభంజనంలో ఆదిమూలం గెలుపొందారు.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిమూలం తనను లైంగికంగా వేధించారని ఓ తెలుగు మహిళా నాయకురాలు ఆరోపిస్తూ అందుకు సంబంధించిన వీడియో టేప్‌లను మీడియాకు ఇవ్వడంతో ఆయన అసలు రంగు బయటపడింది. దీంతో ఆయన ఒక్కొక్క ఇటుక పేర్చి కట్టుకున్న రాజకీయ మేడ పేకమేడలా ఒక్కసారిగా కుప్పకూలినట్లు అయిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సమసిపోని వ్యతిరేకత

ఆదిమూలం ఎమ్మెల్యేగా గెలిచి మూడు నెలలవుతున్నా కష్టపడిన నాయకులను, జెండా మోసిన కార్యకర్తలను విస్మరించి వైసీపీ వారికి మద్దతు ఇస్తున్నారని టీడీపీలోని ఓ వర్గం వాదిస్తోంది. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థికి పని చేసిన వారందరినీ చెరకురసం (ఇండిపెండెంట్ అభ్యర్థి గుర్తు చెరకు) తాగారని దూషిస్తూ పూర్తిగా పక్కన పెట్టారని సమాచారం. అయితే అదే సమయంలో వైసీపీ నాయకులతో పాత బంధాలు కొనసాగిస్తూ చెట్టపట్టాలు వేసుకుని తిరుగుతున్నారని, సొంత పార్టీ నాయకులే ఆయనపై మీడియాకు ఎక్కారు.

అజ్ఞాతంలోకి ఎమ్మెల్యే ఆదిమూలం

ఆరోపణలు కుట్రేనన్న కుటుంబం

తెలుగు మహిళ నేత ఆరోపణల వ్యవహారంలో ముందస్తు సమాచారం వుందో లేదో గానీ బుధవారం రాత్రి నుంచే ఎమ్మెల్యే ఆదిమూలం అజ్ఞాతంలోకి వెళ్ళినట్టు సమాచారం. సాధారణంగా ఎమ్మెల్యే కదలికలు, పాల్గొనే కార్యక్రమాల గురించి నియోజకవర్గవ్యాప్తంగా ముఖ్య నాయకులందరికీ సమాచారం వుంటుంది. కానీ గురువారం ఉదయం నుంచీ ఆయన ఆచూకీ ఎవరికీ తెలియలేదు.పుత్తూరు శివార్లలోని నివాసంలోనూ ఎవరూ అందుబాటులో లేరు. కుటుంబీకులతో పాటు వ్యక్తిగత సిబ్బంది కూడా లేకుండా పోయారు. ఎవరి ఫోన్లూ పనిచేయలేదు. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్ళారన్న ప్రచారం జరిగింది.ఎమ్మెల్యే ఒక ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధితో మాత్రం ఫోన్‌లో మాట్లాడి తనపై కుట్ర జరిగిందంటూ వివరణ ఇచ్చారు.తనకేమీ తెలియదని, తనపై కుట్ర జరిగిందని ఆరోపించారు. ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేశారని, తాను తప్పు చేయలేదని ఎక్కడైనా ప్రమాణానికి సిద్ధమని స్పష్టం చేశారు. తన బిడ్డల సాక్షిగా ఆమె తెలుగు మహిళా నాయకురాలిగా మాత్రమే తెలుసునని, ఇతర పరిచయాలు లేవన్నారు. ఇటీవలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడిన రమేష్‌బాబుతో పాటు పార్టీలోని మునుస్వామి యాదవ్, గిరిబాబు, బాలరాజు తదితర నాయకులు పన్నిన కుట్రగా ఆరోపించారు. అయితే ఆచరణలో ఎవరికీ అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్ళిపోవడంతో ఆయన వాదన బలహీనంగా మారింది.సాయంత్రానికి కుటుంబీకులు అందుబాటులోకి వచ్చారు. ఎమ్మెల్యే ఆదిమూలం సతీమణి గోవిందమ్మ మీడియాతో మాట్లాడుతూ తన భర్త చాలా మంచివాడన్నారు. రాజకీయాల్లో ఎంతో ఎత్తుకు ఎదిగిన తన భర్తను కొందరు కుట్రపన్ని ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిమూలం కుమారుడు, నారాయణవనం జడ్పీటీసీ సుమన్ కుమార్ మాట్లాడుతూ తన తండ్రికి టికెట్ రావడం ఇష్టంలేని టీడీపీలోని కొందరు వైసీపీ వాళ్ళతో చేతులు కలిపి కుట్రలు పన్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేకి ఆరోగ్యం బాగాలేనందున చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని వ్యక్తిగత సిబ్బంది వెల్లడించారు. అంతకుమించి ఏ ఆస్పత్రి అన్న విషయం కూడా చెప్పలేదు. ఆ తర్వాత కుమార్తెలు, అల్లుడు కూడా ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఎప్పుడో జరిగినట్లున్న వీడియోను ఇప్పుడు ఎందుకు విడుదల చేశారో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. కూతురు వయసున్న ఆమె ఆరోపణలు చేయడం వెనుక కొంతమంది టీడీపీ, వైసీపీ నాయకులున్నారని, వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు.కాగా ఎమ్మెల్యే సొంత మండలమైన బీముని చెరువులో మహిళలు ఆదిమూలానికి మద్దతు తెలిపారు.ఆదిమూలంపై ఆరోపణల వెనుక మాజీ మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. ఎమ్మెల్యే పై ఆరోపణలు చేసిన మహిళ దిష్టిబొమ్మను దహనం చేశారు.



మీడియా ఎదుట ఆదిమూలం కుటుంబ సభ్యులు

ఘనంగా గురు పూజోత్సవం

● 72మంది ఉపాధ్యాయులకు సత్కారం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 5: గురువులతోనే మంచి సమాజ నిర్మాణం సాధ్యమౌతుందని కలెక్టర్ వెంకటేశ్వర్, పలువురు ప్రజా ప్రతినిధులు ఉద్ఘాటించారు.జిల్లాస్థాయి గురు పూజోత్సవ కార్యక్రమం తిరుపతిలోని తుడా కార్యాలయం వెనుక వున్న కచ్చపి ఆడిటోరియంలో గురువారం జరిగింది. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథులుగా చంద్రగిరి ఎమ్మెల్యే నాని, పుత్తూరు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, ప్రత్యేక ఆహ్వానితులుగా కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యతోపాటు సామాజిక విలువలు, నైతికత వంటి అంశాలపై పిల్లల్లో అవగాహన పెంచాలని సూచించారు.పిక్టోరియల్ విధానంలో బోధించాలని, కాన్సెప్చువల్ లెర్నింగ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఉపాధ్యాయులకు సూచించారు.మాతృభాషలో బోధిస్తే విద్యార్థులు ఆయా విషయాలను చక్కగా అర్థం చేసుకుంటారని పరిశోధనల్లో తేలిందని చెప్పారు.ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 72మంది ఉపాధ్యాయులను ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.ప్రారంభంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డీఈవో శేఖర్, ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, సీఎంఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఊరందూరు ఉపాధ్యాయుడికి

జాతీయ పురస్కారం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న సురేష్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కూనాటి సురేష్ గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. సాంఘికశాస్త్ర విభాగంలో సురేష్ పలు వినూత్న ఆవిష్కరణలతో ప్రత్యేక గుర్తింపు పొందారు. తెలుగు రాష్ట్రాల్లో సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ పుస్తకాల రచన, పలు యాప్‌ల రూపకల్పన, డిజిటల్ తరగతులకు పాఠ్యాంశాల తయారు లాంటి అంశాల్లో ప్రశంసలు అందుకున్నారు. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో జరిగే ముఖాముఖికి సురేష్ హాజరు కానున్నారు.

ఎర్రచందనం

రూటు మారింది!

- చెన్నై నుంచి గౌహతికి తరలిస్తున్న 140 దుంగల సీజ్
- ఐదుగురు స్మగ్లర్లు, లారీ డ్రైవర్, క్లీనర్లను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్

తడ, సెప్టెంబరు 5 :చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై పట్టపగలు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. చెన్నై నుంచి ఎర్రచందనం అక్రమంగా రవాణా జరుగుతుందన్న సమాచారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందింది.సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ బృందం జాతీయ రహదారిపై నిఘాపెట్టింది.గురువారం మధ్యాహ్నం సమయంలో చెన్నై నుంచి తడ వైపు ఓ వేగనార్ కారు ముందు వెళ్తుండగా దాని వెనుకనే ఒక ఐసర్ కంటైనర్ లారీ వెళ్తుండటాన్ని గుర్తించి టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంట పడ్డారు.వేగంగా వెళ్తున్న లారీని, కారును తడ మండలం బోడిలింగాలపాడు మలుపు దాటిన తరువాత టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ముందుగా కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు.లారీలోని డ్రైవర్‌ను, క్లీనర్‌ను అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. కంటైనర్ లారీలో ముందుపక్క అట్ట బాక్స్‌లు వెనుక ఎర్రచందనం దుంగలు ఉండటం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చి అప్పటికప్పుడు అక్కడికక్కడే పంచనామా నిర్వహించారు. సుమారు 140 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని నిమిషాల వ్యవధిలోనే అక్కడ నుంచి ఆ వాహనాలను, స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడ నుంచి తరలించుకువెళ్లారు. దీనిపై సీఐ సురేష్‌కుమార్‌రెడ్డిని వివరాల కోసం ప్రశ్నించగా ఆయన వివరాలు తెలిపేందుకు నిరాకరించారు.

చెన్నై వదిలి గౌహతికి వెళ్లడమా...?

చైనా, జపాన్ దేశాల్లో విపరీతమైన డిమాండ్ వున్న ఎర్రచందనాన్ని దశాబ్దాలుగా చెన్నైకి తరలించి అక్కడినుంచి ఇతర దేశాలకు స్మగ్లింగ్ చేస్తుంటారు.అయితే గురువారం పట్టుబడ్డ ఎర్రచందనం చెన్నై వదిలి గౌహతికి వెళ్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చైనా, జపాన్‌కే కాకుండా ఏ దేశానికి రవాణా అవుతోందా అని ఆరా తీస్తున్నారు.



ఎర్రచందనంతో పట్టుబడ్డ లారీ



ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్న అక్రమ నిర్మాణాలు

హథీరాంజీ మఠం భూముల్లో

అక్రమ నిర్మాణాల తొలగింపు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 5: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ విద్యుత్‌నగర్ సర్వే నెంబరు 364, 368/1లోని హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలను గురువారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులతో కలసి భారీ పోలీసు బందోబస్తు నడుమ ఎక్స్‌కవేటర్ల సాయంతో మఠం అధికారులు తొలగించారు. ఈ సర్వే నెంబర్లలో మఠానికి సంబంధించి దాదాపు 26 ఎకరాల భూమి (364లో 18-90 ఎకరాలు, 368/1లో 7.70ఎకరాలు) ఉంది. ఈ భూముల్లో ఆలిండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న శివానాయక్ తన అనుచరులతో హథీరాంజీ బావాజీ మఠం పరిరక్షణ సమితి పేరుతో సంస్థను ఏర్పాటు చేసి.. హథీరాం బావాజీ ఆలయ శాశ్వత నిర్మాణంతోపాటు పలు తాత్కాలిక రేకుల షెడ్లను నిర్మిస్తున్నారు. ఇదేస్థలంలో ఓ అమ్మవారి ఆలయ నిర్మాణం కూడా చేపడుతున్నారు. అత్యంత ఖరీదైన మఠం భూములు 26 ఎకరాలు ఆక్రమణకు గురవుతుందన్న సమాచారంతో కలెక్టర్ వెంకటేశ్వర్ చొరవ తీసుకుని ఎస్పీతో మాట్లాడి అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, ఏఎస్పీ రవిమనోహరాచారి నేతృత్వంలో దాదాపు 10 ఎక్స్‌కవేటర్ల సాయంతో ఈ అక్రమ నిర్మాణాలను తొలగించారు.శివానాయక్ తన అనుచరులతో కలసి కూల్చివేతను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. శ్రీవారితో పాచికలు ఆడి శిష్యుడిగా పేరొందిన బంజారాల ఆరాధ్య దైవం హథీరాం బావాజీకి వేలకోట్ల ఆస్తులున్నా ఇప్పటివరకు ఆలయాన్ని నిర్మించలేదన్నారు.తిరుపతిలో ఆలయాన్ని నిర్మించేందుకు మహంత్ అర్జున్‌దాస్‌కి విన్నవించగా స్థలం కేటాయించడంతో ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. దాన్ని ఎక్స్‌కవేటర్లతో కూల్చివేయడం అన్యాయమన్నారు.తనను ముందస్తుగా అరెస్ట్‌చేసి, దౌర్జన్యంగా నిర్మాణాలను తొలగించడం దారుణమన్నారు.

మఠం పేరుతో సంస్థ ఏర్పాటు చట్టరీత్యానేరం

హథీరాంజీ మఠానికి సంబంధం లేని వ్యక్తులు మఠం పేరుతో సంస్థను ఏర్పాటు చేయడం చట్టరీత్యానేరం. శివానాయక్, హరిప్రసాద్‌నాయక్, కిశోర్‌నాయక్ తమ అనుచరులతో కలసి విద్యుత్‌నగర్‌లోని మఠం భూముల్లో నిర్మాణాలను చేపట్టారు. పనులు ఆపేందుకు ప్రయత్నించగా మఠం సిబ్బందిపై దౌర్జన్యం చేశారు. శివానాయక్ సంస్థపేరుతో గుడి నిర్మాణం కోసం బంజారా కులస్తులను మోసగించి, వారివద్ద డబ్బులు వసూలు చేయడంతోపాటు భూమిని కబ్జా చేసేందుకు మహంత్ అర్జున్‌దాస్ సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు దానపత్రంతో కోర్టులు, అధికారుల ద్వారా లబ్ధి పొందేందుకు ప్రయత్నించారు. ఈభూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్ వేసి ప్లాట్లని విక్రయించి.. సామాన్య ప్రజలను మోసం చేశారన్న సమాచారం ఉంది. దీంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం. ప్రజలు కూడా మఠం భూములను కొని, మోసపోవద్దు.

- కేఎస్ రామారావు, హథీరాంజీ మఠం పరిపాలనాధికారి



పట్టుబడిన నిందితులు

పొన్నూరు ఆభరణాలు గాదంకి దగ్గర స్వాధీనం

చంద్రగిరి, సెప్టెంబరు 5: గుంటూరు సమీపం పొన్నూరులోని వెండి దుకాణంలో చోరీ అయిన ఆభరణాలను గాదంకి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు.పొన్నూరులోని ధనలక్ష్మీ జ్యూవెలర్స్‌లోకి బుధవారం రాత్రి ఓ కారులో ఆరుగురు వచ్చి దుకాణం షట్టర్ పగలగొట్టి లోనికి చొరబడ్డారు. ఆభరణాలను మూటలు కట్టి కారులో వేస్తుండగా కొంతమంది యువకులు గమనించి వారిలో రతన్ సింగ్ అనే వ్యక్తిని పట్టుకున్నారుఅతడిని విచారించిన పోలీసులు మరో ఇద్దరు నిందితులను తెనాలిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల సెల్‌ఫోన్ ఆధారంగా కారులో పరారైన వారు బెంగళూరుకు వెళుతున్నట్లు గుర్తించి చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు.సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో వెళ్లి గాదంకి టోల్‌ప్లాజా వద్ద గురువారం ఉదయం వారిలో ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. కారులో వున్న రూ.30 లక్షల విలువైన వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పొన్నూరు పోలీసులకు గురువారం రాత్రి అప్పగించారు.

షార్‌లో ఘనంగా గురు పూజోత్సవం


సర్వేపల్లికి నివాళులు అర్పిస్తున్న షార్ డైరెక్టర్ తదితరులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 5: శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో గురువారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నై సైన్సు అండ్ టెక్నాలజీ సెంటర్ ఈడీ డాక్టర్ ఐకే లెనిన్ తమిల్ కోవన్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వంలో విలువ కట్టలేనిది ఒక గురువు సేవలు మాత్రమేనని, గురు శిష్య పరంపర భావి తరాల్లో కొనసాగాలన్నారు ముందుగా ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ అహమ్మద్, కంట్రోలర్ శ్రీనివాసుల రెడ్డి, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ, అంతరిక్ష కేంద్రీయ పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన సర్వేపల్లి

● మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేటటౌన్, సెప్టెంబరు5: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చారని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం గురుపూజోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రఫీ, చంద్రారెడ్డి, గంగాప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో శర్మ, ఎంఈవో మునిరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.కోటితో తుమ్మూరు శ్మశానవాటిక ఆధునికీకరణ

నాయుడుపేట, సెప్టెంబరు 5: నాయుడుపేటలోని తుమ్మూరు హిందూ శ్మశానవాటిక ఆధునీకరణకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఎస్ఎస్‌రెడ్డి, ఆయన సోదరుడు సన్నారెడ్డి రాజారెడ్డి కోటి రూపాయలు అందజేయనున్నట్లు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. తుమ్మూరు శ్మశానవాటికను టీడీపీ నాయకులతో కలసి గురువారం పరిశీలించారు. శ్మశానవాటికను నాయుడుపేట స్వర్గధామ తరహాలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 5 : ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డాక్టర్ ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం, కూచివాడ పొలాల్లో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ (వరి, వేరుశనగ), డీఆర్‌పీ మోడల్, పీఎండీసీ వేసిన పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి రవిచంద్ర, వ్యవసాయ సంచాలకులు అనిత, ఏడీఏ గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిల్లకూరు, సెప్టెంబరు 5: మండలంలోని బూదనం టోల్ ప్లాజా సమీపంలో తమిళనాడు రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై డీటీ సంధ్య, ఎస్‌ఐ సురేష్‌బాబు పట్టుకున్నారు. చెన్నై నుంచి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా రూ.3.90 లక్షల విలువ చేసే ఏడు టన్నుల తమిళనాడు రేషన్ బియ్యాన్ని నెల్లూరుకు తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నారు. డ్రైవరు కుమారణ్‌ను అదుపులోకి తీసుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 5 : వినాయక ప్రతిమల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీస్ అనుమతి పొందాలని డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నాయుడుపేట డీఎస్పీ కార్యాలయంలో గురువారం వినాయక ప్రతిమల ఏర్పాటు నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ నిమజ్జనానికి ఊరేగింపు సమయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వివాదాలకు తావిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట అర్బన్ సీఐ బాబి, సిబ్బంది ఉన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

జీవో నంబరు 21ని రద్దు చేయాలి

గూడూరు, సెప్టెంబరు 5: మోటారు రంగ కార్మికులకు నష్టం కలిగించే జీవో నంబరు 21ని రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. గురువారం స్థానిక రవాణ శాఖ కార్యాలయంలో ఎంవీఐ జకీర్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రవాణశాఖ జారీ చేసే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటీకరణ కాకుండా ప్రభుత్వం ద్వారానే యదావిధిగా కొనసాగించాలన్నారు. అర్హత కలిగిన డ్రైవర్లకు డ్రైవర్ల సాధికార సంస్థను ఏర్పాటు చేసి రూ. 10వేలు ఆర్థికసాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, నారాయణ, ప్రభాకర్, శశి, సీవీఆర్‌కుమార్, రామానాయుడు, పెంచలయ్య పాల్గొన్నారు.

అల్లాతాత గంధోత్సవానికి జెండా స్థాపన



తడ, సెప్టెంబరు 5 : వేనాడులో వెలసిన దావూద్‌షా వలి అల్లాతాత 29వ గంధోత్సవానికి ప్రారంభంగా జెండా స్థాపన కార్యక్రమం జరిగింది. బుధవారం రాత్రి గ్రామ పెద్దలు సుదర్శన్ మొదలియార్‌తోపాటు ముస్లిం మత పెద్దలు బాబాకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఆవరణలో జెండా స్థాపన (నిషాన్) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. 10వ తేదీ అర్ధరాత్రి గంధోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గ్రామపెద్ద సుదర్శన్‌మొదలియార్ తెలిపారు.

నిత్యావసరాల ధరలను తగ్గించాలి

గూడూరు, సెప్టెంబరు 5: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు అన్నారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ధరలు అధికంగా పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు రేషన్‌కార్డులను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, బాలకృష్ణ, శశి, చంద్రయ్య, నారాయణ, సీవీఆర్‌కుమార్, భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి

కోట, సెప్టెంబరు 5: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. ఆ కళాశాలలో గురువారం ఐఐసీ ఆధ్వర్యంలో ఇంటర్నల్ హ్యాక్‌థాన్- స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ 2024 కార్యక్రమం నిర్వహించారు. ఐఐసీ సెల్ అనుసంధాన కర్త డాక్టర్ నందకుమార్, డాక్టర్ నాగిరెడ్డి, డాక్టర్ శంకరయ్య, డాక్టర్ లక్ష్మణ్‌రావు, వెంటరమణ, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నివారణపై అవగాహన

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 5: పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో గురువారం ర్యాగింగ్‌పై సీఐ రమణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, బాగా చదువుకుని మంచి మార్గంలో నడుచుకోవాలన్నారు.

బెస్ట్ టీచర్ అవార్డులు

జిల్లాస్థాయి గురు పూజోత్సవ కార్యక్రమం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో గురువారం జరిగింది. కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా పలువురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును, ప్రశంసాపత్రాలను అందుకున్నారు.



మధుసూదన్ (హెచ్ఎం, అన్నమేడు, నాయుడుపేట), ఎ.చెన్నమ్మ (ఎస్జీటీ, అక్కసముద్రం, బాలాయపల్లి), పి. శ్రీనివాసులు (స్కూల్ అసిస్టెంట్, చిల్లకూరు), టి. జ్యోతి (ఎస్జీటీ, నాగవోలు, డక్కిలి), వి. శ్రీనివాసులు (ఎస్జీటీ, తల్లంపాడు, దొరవారి సత్రం), కె. శివకళ (ఎస్జీటీ, అయ్యవారిపాళెం, గూడూరు)


మంజుల (ఎస్జీటీ, టీఎన్‌పాళెం, కోట), షఫీవుల్లా (ఎస్ఏ, అన్నమేడు), సుబ్బారావు (పీజీటీ, నాయుడుపేట), శంకరయ్య (ఎస్జీటీ, అత్తపాళెం), శీనివాసులు (ఎస్ఏ, చిల్లమానుచేను, ఓజిలి), జె. దోరతి వయోల (ఎస్జీటీ, కానూరు రాజుపాళెం, పెళ్లకూరు), వి. బాలసుబ్రహ్మణ్యం (ఎస్జీటీ, ఎడపూడి, పెళ్లకూరు)


చంద్రజిత్ యాదవ్ (హెచ్ఎం, కోటాపోలూరు, సూళ్లూరుపేట), శంకరయ్య (ఎస్జీటీ, మర్లపల్లి, నాయుడుపేట), మాల్యాద్రి (ఎస్జీటీ, దుగరాజపట్నం), ఐ.మాలిని (ఎస్జీటీ, వెంకటరెడ్డిపాళెం, వాకాడు), బి.సత్యనారాయణ (ఎస్జీటీ, పారవోలు, వెంకటగిరి), సాయిరాం (ఎస్జీటీ, మొగళ్లగుంట, వెంకటగిరి)

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తడ, సెప్టెంబరు5: పులికాట్ సరస్సులో పక్షుల అభయారణ్యాన్ని కాపాడడం, దాంతోపాటు మత్స్యకారుల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడమే ప్రస్తుత కమిటీ లక్ష్యమని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో పులికాట్ పరిరక్షణపై ఎకో సెన్సిట్యూ జోన్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సభ్యులుగా పాండిచ్చేరి యూనివర్శిటీ ఎకో ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.భూపేష్‌గుప్తా, ఎస్వీ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. రాజశేఖర్, డెహ్రాడూన్ వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త జ్యోతి, సూళ్లూరుపేట వన్యప్రాణి విభాగం డీఎఫ్‌వో శామ్యూల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తుడా ప్లానింగ్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. పులికాట్ సరస్సుకు పూడిరాయ దొరువు వద్ద పూడిక తీయించడం ద్వారా అటు మత్స్యకార కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని కలెక్టర్, కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. సాగరమాల పథకం ద్వారా పూడికతీతకు నిధులు విడుదలైన వెంటనే ఆ పనులు చేస్తామన్నారు. పులికాట్ సరస్సులో పర్యావరణం దెబ్బతినకుండా అభయారణ్యం పెంపొందిస్తూ, ఇందుకు సమాంతరంగా మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిసర ప్రాంతాలలో రహదారులు, మౌళిక సదుపాయాల కల్పన కమిటీ ఆమోదంతో ముందుకు వెళతామన్నారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఏకో టూరిజం ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, వైల్డ్ లైఫ్ డీఎఫ్‌వో శామ్యూల్, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ కమల ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, మత్స్యకార నాయకుడు రఘురెడ్డి, కోదండం, రమేష్, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళం


ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న పీఆర్ క్లబ్ సభ్యులు

గూడూరు, సెప్టెంబరు5:స్థానిక ముత్యాలపేటలోని పీఆర్ క్లబ్‌లో గురువారం క్లబ్ సభ్యులు వరదల్లో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు సీఎం సహాయనిధికి రూ.1.05లక్షల చెక్కును ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి, చదలవాడ హరిప్రసాద్, కోడూరు మీరారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, మస్తాన్‌నాయుడు, విజయ్‌కుమార్, సోమిశెట్టి చెంచురామయ్య, అబ్దుల్ రహీం, శ్రీనివాసులురెడ్డి, భాస్కర్, వెంకటేశ్వర్లురాజు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక కాస్మోపాలిటిన్ క్లబ్‌లో క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సీఎం సహాయనిధికి రూ. 50వేలు చెక్కును ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య శ్రీహరి, సురేంద్రనాథ్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, బత్తిన ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.